Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 136 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 జూన్ 2023 బుధవారం పేజీలు : 4

## భారీగా పెరిగిన వెండి, బంగారం ధరలు

ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, ఆభరణాల మార్కెట్‌లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలు ప్రపంచ వ్యాప్తంగా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. ఇక నేడు గోల్డ్ ధర భారీగా పెరిగింది. దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో బంగారం ధర పెరిగింది. అటు వెండి ధరలోనూ పెరుగుదల కనిపించింది. శుక్రవారం ఢిల్లీలో కిలో వెండిపై రూ.1900 పెరిగి.. రూ.56,500, ముంబయిలో రూ. 56,500, హైదరాబాద్‌లో రూ. 62,200, విజయవాడలో రూ. 61,200, విశాఖపట్నంలో రూ. 61,200గా ఉంది.

# అత్యంత పారదర్శకంగా పరిశ్రమలకు అనుమతులు : మంత్రి కేటీఆర్






యాదాద్రి భువనగిరి : రాష్ట్రంలో పరిశ్రమలకు అత్యంత పారదర్శకంగా అనుమతులు ఇస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. టీఎస్ ఐపాస్ లాంటి విధానం అమెరికాలో కూడా లేదని పేర్కొన్నారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కులో ఏర్పాటు చేసిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అత్యద్భుతంగా పురోగతి సాధించిందని తెలిపారు. పర్యావరణం, పరిశ్రమల రంగాల్లో అద్భుతమైన ప్రగతి జరిగిందన్నారు. తెలంగాణలో సమగ్ర, సమత్యులత, సమ్మిళిత అభివృద్ధి జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యంత పారదర్శకంగా అనుమతులు ఇస్తున్న రాష్ట్రం మన తెలంగాణ మాత్రమే అని గుర్తు చేశారు. టీఎస్ ఐపాస్ విధానంలో 15 రోజుల్లో అనుమతులు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ. అమెరికాలో కూడా ఇలాంటి విధానం లేదు అని అక్కడి పారిశ్రామిక వేత్తలు చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. మానవ చరిత్రలో మూడవ అతి పెద్ద కార్యక్రమం మన హరితహారం కార్యక్రమం అని కేటీఆర్ తెలిపారు. భవిష్యత్ తరాలకు పచ్చటి వాతావరణం అందిస్తున్నామని పేర్కొన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పల్లెలు, పట్టణాలకు పలు జాతీయ అవార్డులు వచ్చాయన్నారు. తెలంగాణలోని మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలు కూడా సంతోషంగా ఉన్నారు. తెలంగాణను అవహేళన చేసిన వాళ్ళు కనుమరుగు అయ్యారని పేర్కొన్నారు. 60 ఏండ్లలో జరగని పనిని ఈ తొమ్మిదేండ్లలో కేసీఆర్ చేసి చూపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇతర దేశాలకు పాఠాలు నేర్పుతుంది అని అమెరికా ఇంజనీర్లు అన్నారు. అది తెలంగాణకు దక్కిన గొప్ప గౌరవం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఐటీ ఉత్పత్తుల నుంచి ఆహార ఉత్పత్తుల వరకు అద్భుత పురోగతి:** ఐటీ ఉత్పత్తుల నుంచి ఆహార ఉత్పత్తుల దాకా అద్భుత పురోగతితో తెలంగాణలో అరుదైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా యాదాద్రి జిల్లా దండు మల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో జరిగిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నైపుణ్య అభివృద్ధి కేంద్రం, కామన్ ఫెసిలిటీ సెంటర్, వ్యర్థాల శుద్ధి కేంద్రం, పారిశ్రామిక వేత్తల సమాఖ్య కార్యాలయాలను మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఏకకాలంలో 51 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్ని ప్రారంభించిన మంత్రులు.. చిన్నారుల కోసం బొమ్మలు తయారు చేసేందుకు ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్న తెలంగాణ టాయ్స్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమగ్ర, సమీకృత, సమతుల్య అభివృద్ధి జరుగుతోందని కేటీఆర్ తెలిపారు. రాబోయే ఎన్నికల కోసం కాకుండా రేపటితరం కోసం కేసీఆర్ పని చేస్తారన్న ఆయన...ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

## సీతక్క ఆమె కొడుకు ఇద్దరికీ చాన్స్?

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఈ మధ్య ఒక కుటుంబానికి ఒకటే పదవి సీటు అంటూ నిక్కచ్చిగా ఓ నియమం పెట్టుకున్నారు. కానీ తెలంగాణలో అధికారం కోసం.. పటిష్టమైన నేతల అవసరం కోసం ఇప్పుడు ఆ నియమాన్ని పక్కనపెట్టినట్టు తెలుస్తోంది. ఒకే కుటుంబం నుంచి ఇద్దరికీ ఎమ్మెల్యే సీట్లు ఇవ్వడానికి ఓకే చెప్పినట్టు సమాచారం. ములుగు ఎమ్మెల్యే సీతక్క తెలంగాణ కాంగ్రెస్ ఒక ఫైర్ బ్రాండ్ నేత. ఆమె ప్రజల మనిషిగా వారి కష్టాలు తీర్చే నేతగా పేరు తెచ్చుకున్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఓట్లేసిన ప్రజలను ఆదుకోవడానికి ఎంతకైనా తెగించే అట్టడుగు రాజకీయ నాయకురాలిగా ప్రఖ్యాతిగాంచారు. గత మూడు ఎన్నికల్లో ములుగు నుంచి సీతక్క గెలిచి.. ప్రజలకు తిరుగులేని ఎంపికగా మారారు.. ఇప్పుడు సీతక్క కొడుకు రాజకీయాల్లోకి వచ్చే సమయం ఆసన్నమైంది. అతను కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. సీతక్క ఆమె కుమారుడు సూర్యకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఖమ్మం జిల్లాలోని పినపాక అసెంబ్లీ నియోజక వర్గాన్ని ఆయన కోసం ఎంపిక చేసినట్టు తెలిసింది. రేగా కాంతారావు 2018 ఎన్నికలలో ఇక్కడ కాంగ్రెస్ టిక్కెట్ నుండి గెలిచారు కానీ తరువాత అతను బీఆర్ఎస్ లోకి ఫిరాయించారు. పినపాక నియోజకవర్గంలో బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ వెతుకుతోంది తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పినపాకకు మారాలని సీతక్కకు సూచించినట్లు సమాచారం. సీతక్క కు ములుగు నియోజకవర్గానికి విడదీయరాని బంధం ఉంది. అయినప్పటికీ రేవంత్ రెడ్డి సూచనను ఆమె పరిగణలోకి తీసుకుంది.. సీతక్క వెంటనే తన కొడుకు సూర్యను పినపాకకు పంపి నియోజకవర్గంలో పనులు ప్రారంభించింది.. సూర్య గత రెండు సంవత్సరాలుగా పినపాక బాధ్యతలను చూస్తున్నాడు.. తన కొడుకును గెలిపించడానికి సీతక్క తరచుగా ఇక్కడికి వస్తూ ఉన్నారు. దీంతో స్థానిక కాంగ్రెస్ క్యాడర్లో నమ్మకం పెంచుకున్న సూర్య ఇప్పుడు అక్కడ బలంగా తయారవుతున్నారు. యువకుడు కావడంతో నియోజకవర్గంలో చాలా చురుగ్గా వ్యవహరిస్తున్నారు. సూర్య చేసిన పనిని చూసిన రేవంత్ రెడ్డి పినపాక నుంచి ఆయనను పోటీకి దింపాలని నిర్ణయించుకున్నారని దీంతో ఆయన కాంగ్రెస్ హైకమాండ్ను సంప్రదించారని సమాచారం. ఢిల్లీ నుంచి రేవంత్కి ఓకే సిగ్నల్ అందడంతో ఇప్పుడు పినపాక బరిలో సీతక్క కొడుకు దిగబోతున్నాడు. మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు అనేక కారణాల వల్ల బీఆర్ఎస్ బి-ఫారం వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఎమ్మెల్యేపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో పాటు ఆయన తీరుతో స్థానిక బీఆర్ఎస్ కేడర్లో చీలిక నెలకొంది. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రేగా కాంతారావుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడటంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సర్వేకు వెళ్లాల్సి వచ్చింది. పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్లో చేరితే పినపాకలో సూర్య గెలుపు కేక్ వాక్ కానుంది. ఖమ్మంలో కాంగ్రెస్ జోరు కొనసాగుతుంది.

## బీఆర్ఎస్ కు వచ్చే సీట్లు ఇవేనా!?




హైదరాబాద్ : రెండు సార్లు గెలిచిన ఉత్సాహంతో హ్యాట్రిక్ కొట్టడానికి బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ పెద్ద పెద్ద ప్లాన్లు వేస్తున్నారు. ఇప్పటికే టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చేసి తమది జాతీయ పార్టీ అని చెప్పుకొస్తున్నారు. పక్కనున్న ఏపీ మహారాష్ట్రలలోనూ పోటీ చేయడానికి ప్లాన్లు చేస్తున్నారు. మొన్నటి కర్ణాటక ఎన్నికల్లో తన మిత్రుడు జేడీయూ అధినేత కుమారస్వామి కోసం పోటీ చేయకుండా ఉన్న కేసీఆర్ ఇప్పుడు వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ప్రతిపక్షాలైన ఆమ్ ఆద్మీ సహా కలిసి వచ్చే పార్టీలతో కలిసి జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయంగా ఎదగాలని చూస్తున్నారు. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం వెనుక కూడా రాజకీయం ఉందని.. దీనివెనుక కేసీఆర్ స్కెచ్ గీశారని అంటున్నారు. ప్రజల్లో ఇప్పుడు జాతీయ భావం మెండుగా ఉంది. బీజేపీ దాన్నే క్యాష్ చేసుకుంటోంది. గుజరాత్ మోడల్ కు పోటీగా.. తెలంగాణ మోడల్ ను దేశానికి చూపించాలని కేసీఆర్ డిసైడ్ అయ్యారు. ఈ క్రమంలోనే మూడోసారి గెలుపు కష్టమని భావిస్తున్న కేసీఆర్ తెలంగాణలో కాంగ్రెస్ సహా చిన్న పార్టీల సాయం తీసుకోవడానికి కూడా వెనుకాడరని అంటున్నారు. ముఖ్యంగా జాతీయ సర్వేలు కూడా కేసీఆర్ ఈసారి మెజార్టీకి పది నుంచి 15 సీట్ల దూరంలో నిలిచిపోతాడని చెబుతున్నాయి. తాజాగా కొన్ని జాతీయ సంస్థలు తెలంగాణలో సర్వే చేయగా కేసీఆర్ పార్టీకి కేవలం 43-48 సీట్లు మాత్రమే వస్తాయని.. అటూ ఇటుగా చూస్తే 50 సీట్ల వరకూ మాత్రమే పెరిగే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. రెండు సార్లు గెలిచిన వ్యతిరేకత వల్ల కేసీఆర్ మూడో సారి ఏకపక్షంగా విజయం సాధించలేరని సర్వేలో తేలింది. అయితే కేసీఆర్ కు సాయంగా ఇటు ఎంఐఎం పార్టీ 7 ఎమ్మెల్యే సీట్లతో ఆదుకునేందుకు రెడీగా ఉంది. ఒకరో ఇద్దరో ఇండిపెండెంట్లు ఎవరో ఒకరు గెలిస్తే ప్రభుత్వంలోకి తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కేసీఆర్ కు కావాల్సినంత స్కోపు ఉంది. ఇక ఇలా కాకుంటే మెజార్టీకి 20 సీట్ల దూరంలో అంటే 40 సీట్లు వచ్చినా కూడా కాంగ్రెస్ తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కేసీఆర్ మొహమాట పడడు. బీజేపీని ఓడించడానికి గద్దెనెక్కకుండా చేయడానికి కాంగ్రెస్ కూడా తప్పనిసరి పరిస్థితుల్లో కేసీఆర్ తో కలవక తప్పని పరిస్థితి. అలా ఎలా చూసుకున్నా వచ్చేసారి కేసీఆర్ దే గెలుపు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# అనేక రంగాల్లో అగ్రభాగాన తెలంగాణ



## నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్



నాగర్‌కర్నూల్ : గతంలో వలసలు, కరువులకు నిలయంగా ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రస్తుతం బ్రహ్మాండమైన అద్భుతాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్పీ, కలెక్టరేట్‌ను పూర్తి చేసి తన చేత ప్రారంభించుకున్నందుకు జిల్లా యంత్రాంగానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని కేసీఆర్ పేర్కొన్నారు. 19వ కలెక్టరేట్‌ను ఇవాళ ప్రారంభించుకున్నాం. గద్వాల, మంచిర్యాల కలెక్టరేట్‌ను కూడా త్వరలో ప్రారంభించుకోబోతున్నాం. ఇవాళ తెలంగాణ అనేక రంగాల్లో అగ్రభాగానా ఉంది. ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న ఇక్కడ ఉన్నారు. ఉద్వేగంతో చాలా గొప్పగా పాటలు రాస్తారు. సహజమైన కవి. వాగు ఎండిపాయేరా, పెద్ద వాగు ఎండిపాయేరా అని వెంకన్న పాటలు రాసారు. దుందుభి నది ఎలా కొట్టుకుపోయిందో వారు చెప్పారు. హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు ఆ వాగు మీద కట్టిన చెక్ డ్యామ్‌లు, నీటిని చూసి ఆనందించిపోయాం. నేను, జయశంకర్ సార్ కలిసి తిరుగుతుంటే.. పాలమూరు కరువు గురించి అనేకసార్లు మాట్లాడుకున్నాం. సూర్యాపేట నుంచి కల్వకుర్తి ప్రాంతమంతా ఎడారిలా ఉండేది. అలాంటి కల్వకుర్తిలో లక్ష ఎకరాలకు నీళ్లు పారుతున్నాయి. ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. మంచినీటి పథకంలో విజయం సాధించాం. అనేక అవార్డులు, రివార్డులు సాధించాం అని కేసీఆర్ తెలిపారు. భారతదేశంలో ఐటీ ఉద్యోగాలకు హైదరాబాద్ నెలవుగా మారిందని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ విధంగా ఈ 9 ఏండ్లలో అనేక విజయాలు సాధించాం. కరోనా, నోట్ల రద్దు బాగా దెబ్బతీసింది. మొత్తంగా ఏడేండ్లలోనే అద్భుతమైన ప్రగతి సాధించినందుకు ప్రభుత్వ ఉద్యోగులను అభినందిస్తున్నాను. అన్ని రంగాలు సమన్వయంతో కలిసి పని చేయడం వల్లే ఈ ప్రగతి సాధ్యమైంది.

వలసలకు, కరువుకు నెలవైన జిల్లాలో అద్భుతమైన, బ్రహ్మాండమైన అద్భుతాలు జరుగుతున్నాయి. కన్నుల పండువగా పంటలు ఉన్నాయి. ప్రభుత్వం ఏ పిలుపునిచ్చినా యజ్ఞంలా, ఒక ధర్మకార్యంలా మీ స్థాయిల్లో పని చేశారు. దేశంలోని ఏ పల్లెలు కూడా మన పల్లెలకు సాటిరావు. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి కావాలి. ధర్మం తప్పకుండా జయిస్తది అని కేసీఆర్ పేర్కొన్నారు.

## సంపాదకీయం

# అసలు రైళ్లు పట్టాలు ఎందుకు తప్పినట్టు?

రైలు ప్రమాదం అనగానే అది పట్టాలు తప్పింది అని అందరికీ అర్థం అయిపోతుంది. అయితే మన దేశంలో ప్రతి ఏటా రైల్వే ప్రమాదాలు సర్వసాధారణం అయిపోయాయి. అధికారికంగా రైల్వే అధికారుల లెక్కల ప్రకారం 2021 లోని దాదాపు 18 వేల రైలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అవన్నీ దాదాపుగా పట్టాలు తప్పడం వల్లే అయ్యాయి. అయితే ఎందుకు ఇంతగా మన దేశంలో రైల్వే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువగా రైళ్లు పట్టాలు ఎందుకు తప్పుతున్నాయనే విషయాలు కచ్చితంగా ఆలోచించాల్సిన విషయం డ్రైవర్లు సిగ్నల్ ల పొరపాట్లు హ్యూమన్ ఎర్రర్స్ కుట్ర కోణాలు వంటి వాటితో పాటు కొన్ని మిషనరీస్ కూడా ఈ ప్రమాదాలకు కారణంగా చెబుతున్నారు. కాగా గత ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం 2018 నుంచి 21 వరకు చోటు చేసుకున్న ప్రమాదాల్లో ప్రతి 10 రైలు ప్రమాదాల్లో ఏడు ప్రమాదాలు పట్టాలు తప్పడం వల్ల జరిగాయి. ఎందుకు తప్పుతున్నాయి అంటే ట్రాకుల్లో నిర్వహణ లోపాలు ప్రధాన సమస్యగా చెబుతున్నారు. రైలు ట్రాక్ ఫ్రాక్చర్ వల్లే ప్రమాదం సంభవించింది అనేది ఎక్కువగా అందరూ చెప్పే విషయం. నిజానికి పట్టాలు అనేవి అన్నీ ఇనుము అనే లోహంతో చేసినవే. కొన్ని కిలోమీటర్ల మేర పరచుకున్న ఈ పట్టాలను నిర్ణీత పొడవులో కట్ చేసి వాటిని అతుకులు వేస్తారు అయితే ఎక్కువ కాలం వాడకుండా ఉండడం వల్ల వాటిలో అక్కడక్కడ పగుళ్లు లేదా చీలికల వంటివి ఏర్పడుతూ ఉంటాయి. వాటిని ఫ్రాక్చర్లుగా చెబుతూ ఉంటారు. వాతావరణ మార్పుల వల్ల ఇలాంటివి ఏర్పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవి శీతాకాలంలో అవి వాతావరణ పరిస్థితులు బట్టి సంకోచించడం జరుగుతూ ఉంటాయి. అందుకే ఈ ట్రాక్ మీద ఎక్కడ చిన్న పొరపాటు జరిగిన ప్రమాదానికి దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే ఎండలేదు వాన లేదు రాత్రి లేదు పగలు లేదు ఈ ట్రాక్ చెకింగ్ టీమ్స్ ఎప్పటికప్పుడు తిరుగుతూనే ఉంటాయి. ఈ ట్రాక్ ఫ్రాక్చర్లను ఈజీగా కనిపెట్టేందుకు సెన్సార్లు ఆధారంగా పనిచేసే ఆటోమేటిక్ మిషన్లను ప్రవేశపెడితే కొంతలో కొంత ఈ ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉందని అంటున్నారు.

# పారిశుద్ధ్యం... అధ్వానం



కరీంనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్, సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో దూసుకెళ్లిన నగరపాలిక..పారిశుద్ధ్య పనుల నిర్వహణలో మరింత మెరుగు పర్చుకుంటుండగా... క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తుండగా.. వీధుల్లో మాత్రం ఆ స్థాయిలో పనులు జరగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. డివిజన్‌కు సరిపడా కార్మికులు ఉన్నారని చెబుతుండగా పనులు నిర్వర్తించేందుకు వచ్చే వారి సంఖ్యలో డుమ్మాలు ఉంటున్నాయి. ఒకటెండ్రు రోజులు కాదు నెలల తరబడి అలాగే ఉండటంతో పలు డివిజన్‌లలో పారిశుద్ధ్య పనులపై ప్రభావం చూపుతోంది.

అంతర్గత వీధుల్లో చెత్తాచెదారం

నగరంలోని ప్రధాన రహదారులు శుభ్రంగా ఊడ్చి చెత్తను తీసుకెళుతుండగా అంతర్గత వీధుల్లో మాత్రం చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఊడ్చి కుప్పలు చేస్తుండగా, తర్వాత ఆ కుప్పలు ఎత్తడం లేదు. ప్రశ్నిస్తే అక్కడికక్కడే చెత్తను కాల్చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు కాల్వల్లోని పూడిక తొలగించి రోడ్ల మీదనే వేస్తున్నారు. గాలి దుమారం వచ్చి వీధుల్లో అపరిశుభ్రత నెలకొంటుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛ ఆటో కార్మికులు రోడ్ల మీద ఉన్న చెత్తను అసలే ఎత్తడం లేదు. మున్సిపల్ కార్మికులే ఎత్తాల్సి వస్తుండటంతో ట్రాక్టర్ వచ్చేంతవరకు వేచి చూడాల్సి వస్తుందని ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు అంటున్నారు.

అపార్టుమెంట్ల వద్దకే ట్రాక్టర్...అపార్టుమెంట్‌లలో చెత్త సేకరణ కోసం యూజర్ ఛార్జీలు తీసుకునే ట్రాక్టర్లకు బదులుగా డివిజన్‌లలో తిరిగే ట్రాక్టర్లను పంపిస్తున్నారు. దీంతో వీధుల్లో ఉన్న చెత్త అలాగే ఉండి అధ్వానంగా మారుతోంది. పలుప్రాంతాల్లో ప్రత్యేకంగా స్వచ్ఛ ఆటోల ద్వారానే చెత్తను సేకరిస్తున్నారు. అక్కడ ఎలాంటి సమస్యలు ఉండటం లేదు. చైతన్యపురి, విద్యానగర్ ప్రాంతంలో సుమారు 50 అపార్టుమెంట్లు ఉన్నాయి. ఇక్కడ ట్రాక్టర్ ద్వారానే చెత్త తరలిస్తున్నారు. దీనిపై పనిచేసే కార్మికులు నెలకు కొంత మొత్తాన్ని యూజర్ ఛార్జీల పేరుతో వసూలు చేసుకోవడంతో మిగతా పారిశుద్ధ్య పనులపై ప్రభావం చూపుతోంది. అదేవిధంగా 55, 53 డివిజన్లకు కలిపి ఒకే ట్రాక్టర్ ఉండటంతో రోడ్లమీద ఊడ్చిన చెత్తను తీసుకెళ్లడంలో జాప్యం జరుగుతోంది. ప్రధాన రోడ్లపై వ్యర్థాలను తీసుకెళ్లకుండా వదిలేస్తున్నారు. గల్లీలో పని చేసే కార్మికుడితో దానిని ఎత్తిస్తుండటంతో మిగతా పనులు చేయడం లేదని ఓ డివిజన్ కార్పొరేటర్ అంటున్నారు. పారిశుద్ధ్య పనులు చేసేందుకు డివిజన్ల వారీగా 11మంది కార్మికులు పని చేయాల్సి ఉండగా ఒక్కో డివిజన్‌లో ఒక్కోరకంగా విధుల్లో ఉంటున్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలంటే కార్మికులతో పాటు ట్రాక్టర్లు కూడా సక్రమంగా వస్తే తప్ప ఆయా డివిజన్‌లలో శుభ్రత మెరుగు పడదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరముందని నగర ప్రజలు అంటున్నారు.

# శస్త్ర చికిత్సలు.. తప్పిన తిప్పలు



గోదావరిఖని : గోదావరిఖనిలో ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి కేవలం ప్రసవ సేవలు, ఎముకల శస్త్ర చికిత్సలకే పరిమితం కాగా గత ఆరు నెలలుగా సాధారణ శస్త్రచికిత్సలు మొదలుకావడంతో ఈ ప్రాంత ప్రజలకు ఆర్థిక భారం తప్పినట్లయింది. గత ఆరు నెలలుగా ప్రతి నెల సుమారు 15 నుంచి 25 సాధారణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. జనరల్ సర్జన్‌గా డాక్టర్ కళావతి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి సాధారణ శస్త్ర చికిత్సలపై దృష్టిసారించగా కొంతకాలం ఆపరేషన్ థియేటరు అందుబాటులో లేకపోవడంతో ముందుకు సాగలేకపోయారు. ప్రత్యేక దృష్టి సారించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఎన్టీపీసీ సహకారంతో ఆస్పత్రిలో జనరల్ సర్జరీ ఆపరేషన్ థియేటరును అందుబాటులోకి తేవడంతో వివిధ రకాల శస్త్రచికిత్సలు మొదలయ్యాయి. ప్రజలు ప్రైవేటుకు వెళ్లి ఆపరేషన్ స్థాయిని బట్టి రూ.20వేల నుంచి రూ.40వేల వరకు వెచ్చిస్తుండగా ఆర్థిక భారం తప్పినట్లయింది. చిన్న చిన్న కణతుల నుంచి మొదలుకొని అపెండిసైటీస్‌తో పాటు రకరకాల శస్త్రచికిత్సలు ఇప్పుడు గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. విషయం తెలుసుకున్న చాలా మంది నేరుగా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చేయించుకుంటున్నారు. ఆస్పత్రి జనరల్ సర్జన్ డాక్టర్ కళావతితో పాటు శిక్షణ కోసం వచ్చిన పీజీ వైద్యులు సైతం జనరల్ సర్జరీపై దృష్టి సారించి సేవలందిస్తున్నారు. ప్రసూతి వైద్య సేవల్లో గోదావరిఖని ఆస్పత్రి ప్రత్యేకతను సంతరించుకున్నప్పటికీ శస్త్రచికిత్సతో ప్రసవాలు చేస్తున్న సమయంలో అధిక రక్తస్రావంతో పాటు ఇతర సమస్యలు ఎదురైనప్పుడు ఆందోళనకు గురయ్యే వైద్యులు ప్రైవేటు జనరల్ సర్జన్ల సహకారంతో శస్త్ర చికిత్సలు చేసేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఆస్పత్రిలోనే జనరల్ సర్జన్లు అందుబాటులో ఉండడంతో నిరంతరంగా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లయింది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు గోదావరిఖని సార్వజనిక ఆస్పత్రిలో జనరల్ సర్జరీలు మొదలయ్యాయనే విషయాన్ని తెలుసుకోవడంతో పాటు తోటి వారికి అవగాహన కల్గిస్తూ అవసరమైన వారు సేవలను వినియోగించుకోవాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.

నిరుపేదలకెంతో ఉపయోగకరం– ఎం.శ్యామల, రాణాపూర్

తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న తాను ప్రభుత్వ ఆస్పత్రికి రాగానే తక్షణమే నొప్పి తగ్గించేలా వైద్యం చేశారు. అపెండిసైటిస్ శస్త్రచికిత్స చేశారు. ప్రైవేటుకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని నాలాంటి వారెందరికో ప్రభుత్వ ఆస్పత్రిలో మొదలైన సాధారణ శస్త్రచికిత్సలు ఎంతగానో దోహదపడనున్నాయి. పైసా ఖర్చు లేకుండా శస్త్ర చికిత్స చేసిన వైద్యులు, వైద్య సిబ్బంది నాలో ధైర్యాన్ని నింపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నాలాగా చాలా మంది సాధారణ శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారు.

అందుబాటులోకి వివిధ రకాల శస్త్రచికిత్సలు–డాక్టర్ కళావతి, జనరల్ సర్జన్, ఖని ఆస్పత్రి

గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆస్పత్రిలో ఇప్పుడు అన్ని రకాల సాధారణ శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. తాను మహిళను కావడంతో కేవలం మహిళలకు మాత్రమే శస్త్ర చికిత్సలు చేస్తారనే అపోహను వీడాలి. మహిళలతో పాటు పురుషులకు సైతం అవసరమైన శస్త్రచికిత్సలు చేస్తున్నాం. గోదావరిఖని ప్రాంతానికి చెందిన తాను ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే పట్టుదలతో ముందుకు సాగుతుండగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర సిబ్బంది సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారు.

# కొత్తగా రెండు బస్తీ దవాఖానాలు

కరీంనగర్ : విలీన గ్రామాలలో విస్తరించిన కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో కొత్తగా రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరం తరహాలోనే వీటిని ఏర్పాటు చేసి సేవలను అందించనున్నారు. ఇందుకు సంబంధించి అందుబాటులో ఉన్న భవనాల్లో బస్తీ దవాఖానాల కోసం మార్పులు చేర్పులు చేసి అప్పగించనున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్వహణ జరగనుంది.

ఏర్పాటు ఇలాప్రతి బస్తీ దవాఖానాలో ఒక వైద్యుడు, ఒక స్టాఫ్ నర్స్ ఉంటారు. వీరికి పది వేల జనాభా పరిధిని అప్పగిస్తారు. వీరిద్దరూ స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారు. ఇన్‌పేషెంట్ సౌకర్యం ఉండదు. దవాఖానాలు ప్రస్తుతం నగరంలోని బుట్టిరాజారాం కాలనీ, విద్యానగర్ పరిధిలోకి వస్తాయి. బస్తీ దవఖానాలకు అవసరమైన మందులను పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి సరఫరా చేసి వివరాలను నమోదు చేస్తారు.

సబ్‌సెంటర్ సౌకర్యం..రేకుర్తి, తీగలగుట్టపల్లి గ్రామాలలో కొత్తగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రేకుర్తిలో సబ్ సెంటర్, తీగలగుట్టపల్లిలో పాత పంచాయతీ భవనాలను ఉపయోగిస్తారు. వైద్య ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా ఈ భవనాలను ఆధునికీకరించనున్నారు. ఇందులో తప్పనిసరి అయితే సబ్ సెంటర్ సౌకర్యం ఉంటుంది. దవాఖానాకు సంబంధించి రికార్డుల నిర్వహణ వంటి వాటికోసం ఉపయోగిస్తారు. ఫీల్డ్ వర్క్ ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే పట్టణ ఆరోగ్య కేంద్రాలుకరీంనగర్ పట్టణంలో ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆరోగ్య ఉప కేంద్రాలు లేవు. ఒక్కో పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఐదుగురు ఎ.ఎన్.ఎం.లు ఉంటారు. ఒక్కో ఎ.ఎన్.ఎం.కు పదివేల జనాభాను కేటాయించి ప్రాంతాలను నిర్ణయించారు. మొత్తం 30 మంది ఎ.ఎన్.ఎం.లు మూడు లక్షల జనాభా పరిధిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జ్వర సర్వే, కరోనా టీకా సర్వే వంటి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ చేపట్టే కార్యక్రమాలలో భాగస్వాములవుతారు. కొత్తగా వచ్చే దవాఖానాలతో మొత్తం మూడు లక్షల 20 వేల మంది జనాభా పరిధిలో వైద్య సేవలు ఉంటాయి. మిగిలిన జనాభాకు కూడా సేవలను అందుబాటులోకి తేనున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం– మేయర్ సునీల్‌రావుబస్తీ దవాఖానాల ఏర్పాటుకు పూర్తి స్థాయి తమవంతు సహకారం ఉంటుంది. విలీన గ్రామాలలోనే వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. త్వరలోనే వైద్య ఆరోగ్య శాఖతో కలిసి ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తాం.

# శిక్షణతో రక్షణ..!

మణుగూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటన విడుదల చేయటంతో నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ప్రభుత్వం ప్రకటించిన ఖాళీల్లో పోలీసు కొలువులే ఎక్కువగా ఉన్నాయి. చాలామంది యువతీ, యువకులు పోలీసు ఉద్యోగాన్ని సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. నగరాలకు వెళ్లి శిక్షణ పొందాలంటే పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో ఖర్చుతో కూడింది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉండే యువత తర్జనభర్జన పడుతున్నారు. భద్రాద్రి జిల్లాలో చాలా భాగం సింగరేణి ప్రభావిత ప్రాంతాలున్నాయి. మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల్లో సంస్థ విస్తరించింది. వేలమంది సింగరేణి కుటుంబాలతోపాటు ప్రభావిత గ్రామాల్లో వేల సంఖ్యలో నిరుద్యోగులున్నారు. పోలీసు ఉద్యోగాలు సన్నద్ధమవుతున్న యువతకు గతంలోలా సంస్థ శిక్షణ అందిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. యాజమాన్యం నిర్ణయంతో సింగరేణి కార్మికుల, మాజీ కార్మికుల పిల్లలు, ప్రభావిత, పునరావాస గ్రామాల యువతకు లబ్ధి చేకూరుతుంది.

సదుపాయాలకు ఢోకా లేదు..సింగరేణి విస్తరించిన ప్రాంతాల్లో పోలీసు ఉద్యోగాల శిక్షణ అందించేందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయి. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు పట్టణాల్లో సంస్థకు చెందిన క్రీడా



మైదానం, వ్యాయామశాల, ఈత కొలనులు ఉన్నాయి. అంతేకాకుండా గని ఉద్యోగుల్లో ఎంతోమంది క్రీడాకారులున్నారు. వారికి శిక్షణ అందించే ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. గ్రంథాలయాల్లో వార్త పత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు. రాత పరీక్షల్లో శిక్షణకు సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులను నియమించుకునే అవకాశమూ ఉంది.

గతంలో వేలమందికి లబ్ధి

2018లో ఆర్మీ, పోలీసు ఉద్యోగాల కోసం సంస్థ శిక్షణ అందించింది. దీన్ని సద్వినియోగం చేసుకుని ఎంతోమంది ఆర్మీ, ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఆర్మీ శిక్షణ ఇచ్చేందుకు క్యాంపులు నిర్వహించి యువకులను ఎంపిక చేశారు. శిక్షణ సమయంలో వారికి వసతి, భోజన సదుపాయం కల్పించారు. ఉదయం పాలు, పండ్లను అందించారు.

లి సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో 4312 మంది ఆర్మీలో శిక్షణ పొందగా 772 మంది ఎంపికయ్యారు.

లి 1573 మంది పోలీసు ఉద్యోగాలకు శిక్షణ పొందగా 196 మంది ఎంపికయ్యారు. మణుగూరు ఏరియాలో 600, ఇల్లెందు ఏరియాలో 1023, కొత్తగూడెం ఏరియాలో వేలమంది యువత శిక్షణ తీసుకున్నారు.యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తాంజక్కం రమేశ్, మణుగూరు జీఎంసింగరేణి తరఫున యువతీ, యువకులకు పోలీసు శిక్షణ ఇచ్చే విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తాం. గతంలో ఇచ్చిన శిక్షణను చాలామంది సద్వినియోగం చేసుకున్నారు. అవకాశం ఉన్నంత వరకు ప్రయత్నిస్తాం.

# మొరం.. అక్రమార్కుల వరం

ఇల్లెందు : మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకొంటున్నారు. రోజురోజుకూ గృహ నిర్మాణాలు పెరిగిపోతుండటంతో ఈ దందా అధికంగా కొనసాగుతోంది. పట్టా, అసైన్డ్, ప్రభుత్వ, అటవీ భూముల్లో పెద్దఎత్తున తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పగలు రాత్రి తేడా లేకుండా ఇల్లెందు పట్టణం, మండలం, టేకులపల్లి, కామేపల్లి మండలాల్లో మొరం వ్యాపారం 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా సజావుగా సాగుతోంది.

అనుమతులు శూన్యం..

మొరం తవ్వాలంటే కచ్చితంగా మైనింగ్, అటవీ, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి.

వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి.

మైనింగ్ అధికారులు వే బిల్లులు జారీ చేయాలి.

తవ్వకాలు జరిపే పంచాయతీలకు పన్నులు చెల్లించాలి. ఎక్కడా కూడా అనుమతులు పొందడం, పన్నులు చెల్లించడం లేదు.

ట్రాక్టర్ మొరం రూ.400 నుంచి రూ.800

మొరం అవసరాలు పెరుగుతుండటంతో అక్రమార్కులు దాని విలువను సైతం పెంచేశారు.

ఒక్కో ట్రాక్టర్ రూ.400 నుంచి రూ.800, లారీ టిప్పర్‌కు రూ.1,600 నుంచి రూ.2 వేలు తీసుకుంటున్నారు.



మొరం నింపుకొన్న ట్రాక్టర్లు బైపాస్‌రోడ్డు, దొంగ దారుల్లో గమ్యానికి చేరుకుంటున్నాయి.

పట్టణంలోని సత్యనారాయణపురం, మండలంలోని మొండితోగు, బోజ్జాయిగూడెం, రోంపెడు, ముకుందాపురం తదితర ప్రాంతాల్లో తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి.

అనుమతి లేకుంటే చర్యలు తప్పవు: తహసీల్దారు ఎం.కృష్ణవేణి

మొరం తవ్వాలంటే ఎలాంటి భూమి అయిన కచ్చితంగా అనుమతి పొందాలి. అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే వాహనాలు సీజ్ చేసి జరిమానా వేస్తాం. భూ యజమానిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల అక్రమంగా మొరం తవ్వుతున్న రెండు జేసీబీలకు రూ.25 వేల చొప్పున జరిమానా, మూడు ట్రాక్టర్లకు కలిపి రూ.15 వేల జరిమానా వేశాం.

## పారిశ్రామిక రంగం కొత్త పుంతలు..!

మహబూబ్‌నగర్: తెలంగాణ ఏర్పడిన తర్వాత పాలమూరులో పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కింది. ఇటీవల మహబూబ్‌నగర్ శివారులోని దివిటిపల్లిలో 262 ఎకరాల్లో రూ.9,500 కోట్లతో ఏర్పాటు చేయనున్న అమరరాజా బ్యాటరీస్ గిగా కారిడార్‌కు శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే 10వేల మందికి ఉపాధి లభించనుంది. మరో ఐదెకరాల్లో రూ.40కోట్లతో నిర్మించిన ఐటీ టవర్ భవనాన్ని ప్రారంభించారు. దీని ద్వారా నాలుగేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల ఉద్యోగాలే లక్ష్యంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు ముందుకొచ్చాయి. 2014లో రాష్ట్రం ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం టీఎస్ఐపాస్ ఏర్పాటు చేసింది. పాలమూరు జిల్లాల్లో మహబూబ్‌నగర్ శివారులోని ఐటీ, మల్టీపర్పస్ ఇండ్రస్ట్రీస్ కారిడార్, జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ, జడ్చర్ల, గద్వాల, పాలెం పారిశ్రామికవాడలున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎల్ఐజీ హౌజ్, నంచర్లలో పారిశ్రామికవాడల అభివృద్ధికి టీఎస్ఐఐసీ స్థలాలను కేటాయించింది. 2015 నుంచి ఉమ్మడి జిల్లాకు 665 యూనిట్లు వచ్చాయి. ఈ పరిశ్రమల్లో రూ.12,540 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

మెరుగవుతున్న సేవలు..

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనే మొదటి వైద్య కళాశాలను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కళాశాలను పీజీకి అప్‌గ్రేడ్ చేశారు. జిల్లా ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా మార్చారు. ప్రస్తుతం 650 పడకలతో వివిధ సేవలందిస్తున్నారు. మరోవైపు పాత కలెక్టరేట్ స్థానంలో రూ.500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో ఉంది. జిల్లాలుగా మారడంతో నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, వనపర్తి ప్రాంతీయ ఆస్పత్రులను జిల్లాస్థాయి ఆస్పత్రులుగా మార్చారు. కొత్తగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు వైద్య కళాశాలలు వచ్చాయి. జిల్లా ఆస్పత్రులను 100 పడకల నుంచి 380 పడకలకు మార్చారు. జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు కూడా మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదు వైద్య కళాశాలలకు ప్రభుత్వం



రూ.2,500 కోట్లు కేటాయించింది. ఐదు జిల్లాలకు నర్సింగ్ కళాశాలలను మంజూరు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, అచ్చంపేటలో ఇటీవలే వంద పడకల ఆస్పత్రులు ప్రారంభించారు. జిల్లాలోని బాలానగర్, కోయిల్‌సాగర్‌లో 30 పడకలతో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో అమ్రాబాద్, ఉప్పునుంతల మండలాల్లో 30 పడకల ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. నారాయణపేట జిల్లాలో చిన్న పిల్లల ఆస్పత్రి ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంతోపాటు కొల్లాపూర్‌లో మతాశిశు సంరక్షణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.

ఉన్నత విద్య వైపు  అడుగులు..

పాలమూరు జిల్లాల్లో విద్యారంగంలో పలు మార్పులొచ్చాయి. ప్రధానంగా ఉన్నత విద్యకు ప్రాధాన్యం లభిస్తోంది. ఒకప్పుడు ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలకే పరిమితమైన ఈ జిల్లాల్లో ఉన్నత విద్య సంస్థలకు అడుగులు పడ్డాయి. వనపర్తి జిల్లాకు జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల వచ్చింది. రాష్ట్రంలో నాలుగో కళాశాల ఈ ప్రాంతానికి రావడం గమనార్హం. పాలమూరు యూనివర్సిటీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. పీయూ పరిధిలో కొత్తగా ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ(తెలుగు) కోర్సులు ప్రారంభించారు. వనపర్తిలో మైక్రోబయోలజీ, కొల్లాపూర్‌లో స్టాటిస్టిక్స్, గద్వాలలో ఎంబీఏ కోర్సులను ప్రవేశపెట్టారు. నారాయణపేట జిల్లాలోని ధన్వాడ, మక్తల్‌కు డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి జిల్లాలో 35 గురుకులాలుంటే వాటి సంఖ్య ప్రస్తుతం 105కు పెరిగింది. గతంలో మైనార్టీ గురుకులాల్లేవు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉమ్మడి జిల్లాలో 30 వరకు మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేయడం విశేషం. 'మన ఊరు-మన బడి'లో మహబూబ్‌నగర్ జిల్లాలో 291 పాఠశాలలు, నాగర్‌కర్నూల్-290, వనపర్తి-183, జోగులాంబ గద్వాల-161, నారాయణపేటలో 174 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పాలమూరు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,188 పాఠశాలలున్నాయి. అందులో 3.51 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2లక్షల మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నారు.

సాంకేతిక విద్యపైనా దృష్టి సారించాలి

తెలంగాణా రాష్ట్రం ఏర్పాటయ్యాక పెద్దఎత్తున గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేయడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, వసతి సౌకర్యాలు సమకూరాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో కూడా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే నడిగడ్డకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం సాంకేతిక, వృత్తి విద్యాసంస్థలను పెద్దఎత్తున నెలకొల్పాల్సిన అవసరం ఉంది.

హంపయ్య, గద్వాల

వైద్యరంగంలో మెరుగైన అభివృద్ధి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య కళాశాలను ప్రారంభించారు. డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి రావడం శుభపరిమాణం. జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను భర్తీ చేస్తే రోగులకు మరిన్ని సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా అత్యవసర వాహనాల సంఖ్య మరింత పెంచాలి. సర్కారు దవాఖానాల్లో వైద్యుల జవాబుదారీతనం పెంచాలి.

పద్మావతి, నాగర్‌కర్నూల్

పెట్టుబడులు ఆకర్షించాలి..

యువతరానికి ఉద్యోగ కల్పన, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, అందుబాటులో ఉన్న వనరులను ఆదర్శవంతంగా వినియోగించుకోవడం ద్వారా వృద్ధి అవకాశాలు మరింత పెరుగుతాయి. పారిశ్రామిక రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించాలి. పట్టణ, గ్రామీణ యువతరానికి ఉపాధి అవకాశాలు సృష్టించేలా ఉత్పాదక రంగాలపై దృష్టి కేంద్రీకరించాలి. నిరంతర విద్యుత్తు లభ్యత, పారిశ్రామికాభివృద్ధిలో అత్యంత ప్రధానం. పాలమూరు హైదరాబాదుకు సమీపంలో ఉండటం అన్ని విధాలుగా పారిశ్రామికాభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటుంది. డా.ఎం.అనురాధరెడ్డి, కామర్స్ విభాగాధిపతి, పీయూ

## వివాదానికి పరిష్కారం దొరికేనా!



నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం జరగనుంది. హైదరాబాద్‌లోని రూసా భవనంలో ఉదయం 11 గంటలకు సభ్యులు భేటీ కానున్నారు. ముందస్తుగా నిర్ణయించిన సమావేశమైనప్పటికీ.. వర్సిటీలో నెలకొన్న వివాదాలకు పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉంటుందా..? అనే చర్చ సాగుతోంది. పాలకమండలి నియమించిన రిజిస్ట్రార్ ఆ బాధ్యతలకు దూరంగా ఉంటున్నారు. ఉపకులపతి నియమించిన రిజిస్ట్రార్ అధికారిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. మే నెల వేతనాల బిల్లులపై ఆయన సంతకాలు చేశారు. ప్రస్తుతం అవి బ్యాంకుకు చేరాయి. అయితే రిజిస్ట్రార్ విషయంలో గత నెల ఇదే సమయానికి రిజిస్ట్రార్ ఎవరనే విషయంలో సందిగ్ధతతో బ్యాంకు వారు బిల్లులను అనుమతించని విషయం తెలిసిందే. మళ్లీ అదే పరిస్థితులు నెలకొన్నాయి. బ్యాంకు వారు వాటిని అనుమతిస్తారా..తిరస్కరిస్తారనేది సోమవారం లోపు తేలిపోనుంది.

భిన్నవాదలతో ఎన్నాళ్లు..: పాలకమండలిలో విద్యశాఖ కార్యదర్శి, కళాశాల విద్య కమిషనర్లు ప్రభుత్వం తరఫున ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు. ఉపకులపతికి, పాలకమండలికి మధ్య అభిప్రాయభేదాల నేపథ్యంలో సమావేశాలు జరుగుతున్న తీరు వివాదాస్పదం అవుతోంది. ఉపకులపతి హాజరుకావటం లేదు. ఎక్స్‌అఫీసియో హెూదాలో పాల్గొంటున్న ఐఏఎస్‌లలో ఒకరు ఛైర్మన్‌గా సమావేశాలు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాల చట్టానికి లోబడి ఈ విధంగా ముందుకెళ్తున్నామని వివరిస్తున్నారు. కాగా.. పాలకమండలికి ఛైర్మన్ హెూదా ఉపకులపతిగా తనదే అని.. తాను లేకుండా సమావేశాలు నిర్వహించటం, తీర్మానాలు చేయటం చెల్లుబాటు కావనేది ఉపకులపతి వాదన. ఈ విషయంలో ఆయన కోర్టుకు వెళ్లి మరీ మధ్యంతర ఉత్తర్వులు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సభ్యులు తాను లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని ఆయన చెబుతున్నారు. ఈ మేరకు ఆయన ఓ లేఖనూ విడుదల చేశారు.

కొనసాగుతున్న గందరగోళం: ఉప కులపతి, పాలక మండలికి మధ్య విభేదాలు న్యాయస్థానం వరకు చేరటంతో వివాదం తీవ్ర రూపం దాల్చింది. ఇరువురు ఏకతాటిపైకి వచ్చి చర్చించే పరిస్థితులు కనిపించటం లేదు. ఉపకులపతి తనకు అధికారాలున్నాయని చెబుతూ రిజిస్ట్రార్‌ను నియమిస్తూ పోతున్నారు. పాలకమండలి ఇదే తరహాలో మరొకరిని నియమిస్తోంది. ఇలా ఎవరి దారి వారిదే అవుతున్న తరుణంలో వర్సిటీ పాలనలో గందరగోళం నెలకొంటోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన నిధుల వ్యయాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయనేది పాలకమండలి వాదన. అలాంటిదేమీ లేదని ఉపకులపతి చెప్పుకొస్తున్నారు. ఇందులో ఏది నిజం అని తేల్చితే కాని వివాదం ఒక కొలిక్కి రాదు. అది చేయాలంటే.. ప్రభుత్వం కల్పించుకోవాలి. అదే జరిగితే కొత్త సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందనే చర్చ మొదలైంది. కోర్టులో మధ్యంతర ఉత్తర్వులపై పాలకమండలి వేసిన పిటీషన్ విచారణకు వచ్చాక గానీ చేసిన తీర్మానాల అమలుకు అడుగులు పడే పరిస్థితి కనిపించటం లేదు.

## సేవలకు ఆయుష్ తీరిందా..?




కామారెడ్డి: దీర్ఘకాలిక వ్యాధులను ఎదుర్కోవడానికి ఆయుర్వేద, హెూమియో, యునానీలో మెరుగైన ఔషధాలు ఉన్నాయని ఆయుష్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఈ వైద్యశాలలపై పర్యవేక్షణ కొరవడి రోగులకు సేవలు అందడం లేదు. జిల్లాలో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్(ఎన్ఆర్‌హెచ్ఎం)తో పాటు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆయుర్వేద, యునానీ, హెూమియో వైద్యశాలలు ఉండగా వీటిలో సిబ్బంది కొరత ఉంది. ఈ ఆసుపత్రుల్లో వైద్యులు నెలకు రెండు నుంచి మూడు రోజులు మాత్రమే విధులకు హజరవుతూ నామమాత్రంగా నిర్వహిస్తున్న తీరుపై

వైద్యం అటకెక్కుతోంది ఆయుష్ వైద్యశాలల్లో నిబంధనల ప్రకారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ సేవలందించి ఔషధాలు ఇవ్వాలి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు రోగులకు వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది. కాని వైద్యులు నామామాత్రంగా సేవలందిస్తున్నారు. వైద్యులున్న వైద్యశాలల్లో ఫార్మాసిస్టును నియమించడం లేదు. ఫార్మాసిస్టు ఉన్న వైద్యశాలల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడు వైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేశారు.

ఇవీ ఘటనలు.. బాన్సువాడ ఆయుష్ వైద్యశాలలో ఓ వైద్యుడు కేవలం వారానికి ఒక్క రోజుమాత్రమే విధులకు హాజరవుతున్నట్లు ఆ శాఖ అధికారుల తనిఖీల్లో నిర్ధారణ అయింది. నాలుగేళ్లుగా ఇదే తీరున విధులు నిర్వహిస్తున్నట్లు వైద్యశాల సిబ్బంది అనధికారికంగా చెబుతున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు వైద్యుడి పనితీరుపై జిల్లాస్థాయి అధికారులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. నిబంధనల ప్రకారం వైద్యశాల పరిధిలోని పల్లెలతో పాటు పట్టణంలో క్యాంప్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. నాలుగేళ్లుగా ఈ వైద్యుడి ఆధ్వర్యంలో ఒక్క క్యాంపు నిర్వహించిన దాఖలాలు లేవు. ఇటీవల కంటి వెలుగు విధులకు గైర్హాజరు కావడంతో జిల్లా పాలనాధికారి జితేష్ వి పాటిల్ ఈ వైద్యుడికి మెమో సైతం జారీచేసి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో మచ్చిక చేసుకొని చర్యలు లేకుండా చూసుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి.


పిట్లంలో ఎన్ఆర్‌హెచ్ఎం కింద విధులు నిర్వహిస్తున్న ఓ ఒప్పంద వైద్యుడు సైతం వారానికి ఒకటి రెండు రోజులే విధులు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ వైద్యుడికి ఎల్లారెడ్డి ఆయుష్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించగా.. ఆయా ఆసుపత్రిలో గత ఏడాది కాలంగా ఓపీ నిర్వహించిన దాఖలాలు లేవు.

ఔషధాలు పంపిణీ చేయవద్దని ఆయుష్ వైద్యశాఖ నిర్దేశించిందని చెబుతూ.. రాజంపేట మండలం ఆర్గొండ ఆయుష్ వైద్యశాలలో ఫార్మాసిస్టు పదిరోజులకోసారి విధులకు హాజరవుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఫిర్యాదులపై చర్యలకు నివేదించాం- డాక్టర్ రవి నాయక్, ఆర్‌డీడీ, వరంగల్‌జిల్లాలోని ఆయుష్ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంపై ఫిర్యాదులున్న మాట వాస్తవమే. బాన్సువాడ యునానీ వైద్యుడి పనితీరుపై పలు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిబంధనలకు అనుగుణంగా ఆయుష్ పరిధిలోని విభాగాల వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కాకపోతే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలుంటాయి.

## లోతట్టుపై ముందుచూపు!

మహబూబ్‌నగర్: ఏటా భారీ వర్షాలకు పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రతి ఏడాది ఈ సమస్య ఎదురవుతోంది. లోతట్టు ప్రాంతాలు మునకకు గురికాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలొచ్చాయి. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నారాయణపేట, జడ్చర్ల, అయిజ, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పాత పురపాలికలు కాగా భూత్పూర్, కోస్గి, మక్తల్, పెబ్బేరు, కొత్తకోట, అమరచింత, ఆత్మకూరు, అలంపూర్, వడ్డేపల్లి కొత్త బల్దియాలుగా అవతరించాయి. ఓమోస్తారు వర్షాలు కురిసినా ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కొత్త పురాల్లో సమస్య అంత తీవ్రంగా లేకపోయినా వరద నీరు సవ్యంగా ముందుకెళ్లే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వర్షాలు కురిసినప్పుడే హడావిడి : పట్టణాధికారులు, పాలకవర్గాలు వర్షాలు కురిసినప్పుడు హడావిడి సృష్టించి తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఈసారి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వరద నుంచి ఉపశమనం కలుగుతుందో లేదో చూడాలి. ప్రధాన మురుగుకాలువలు, లోతట్టు ప్రాంతాల్లోని గుంతల్లో నీరు చేరకుండా నీటిని మళ్లించే చర్యలు, అంతర్గత కాలనీల్లో మురుగు కాలువల్లో పూడికతీత తదితర చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇవన్నీ పురాల్లో చేపడితే కనీసం కొంతలోకొంతైనా వరద ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం పుర అధికారులు మురుగు కాలువల్లో పూడికతీత చర్యలు చేపట్టారు.



ప్రధానంగా వరద ముంపునకు కారణమయ్యే ప్రాంతాల్లో ఈ పనులు వందశాతం చేపట్టాలని కసరత్తు చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి నేరుగా లోతట్టుకు నీరు రాకుండా మళ్లించే చర్యలు ఇంకా చేపట్టలేదు. చెరువులు, వాగులు, వంకలు ఆక్రమణకు గురైన ప్రాంతాల్లో వరద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అలాంటి ప్రాంతాల్లో చర్యలు ప్రారంభించాల్సి ఉంది. ప్రస్తుతం మొదలుపెట్టిన పనులు త్వరగా పూర్తి చేయకపోతే ఈసారి ముప్పు తప్పదని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. చర్యలు చేపడుతున్నాం : సీడీఎంఏ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలను పాటిస్తాం. ఏటా వరద ప్రాంతాల్లో చర్యలు చేపడుతన్నాం. ఈసారి ముందస్తుగా అయిజలో మురుగు కాలువల్లో పూడిక తీయిస్తున్నాం. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిపెట్టి అక్కడ పనులకు ఉపక్రమించాం. పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లో వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటాం. నర్సయ్య, అయిజ పుర కమిషనర్

## వేలిముద్రల ప్రొఫెసర్లు

హైదరాబాద్ :అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం.. పరిశ్రమలకవసరమైన మానవ వనరులను విద్యాసంస్థల్లో తీర్చిదిద్దుతున్నామంటూ చెబుతున్న జేఎన్‌టీయూ ఉన్నతాధికారుల మాటలు నీటిమూటలయ్యాయి. జేఎన్‌టీయూ పరిధిలోని 214 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకుగాను 40 శాతం కళాశాలల్లో 'వేలిముద్రల' ప్రొఫెసర్లే ఎక్కువమంది ఉన్నారు. వీరు బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోతారు. తరగతులు చెప్పరు. అనుబంధ హెూదాను (అఫిలియేషన్) కాపాడుకునేందుకు కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారి విద్యార్హతలను కొంటున్నాయి. నిజ నిర్ధరణ కమిటీ తనిఖీల్లో ఇవన్నీ బహిర్గతం కావడం లేదు. ఫలితంగా ఈ ఏడాది బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 16 వేల మంది ఫెయిలయ్యారు.

రికార్డుల్లో గరిష్ఠ వేతనాలు..

కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధన సక్రమంగా లేదు. డిమాండ్ ఉన్న కోర్సులు, అత్యుత్తమ ఫ్యాకల్టీ, త్వరలో అటానమస్ (స్వయం ప్రతిపత్తి) వస్తుందనే ప్రచారంతో ఆకర్షిస్తున్నారు. డొనేషన్ల పేరుతో రూ.కోట్లు సంపాదించుకుంటున్నారు. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లను, సహ, సహాయ ఆచార్యులను నియమించుకోవడం లేదు. ప్రొఫెసర్లుగా వర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పదవీ విరమణ చేసిన వారిని, కళాశాల కొత్తగా ఏర్పాటు చేసినప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరినవారికి మాత్రమే రూ.70 వేల-రూ.లక్ష జీతం ఇస్తున్నారు. సహ ఆచార్యులుగా పనిచేస్తున్నవారికి యూజీసీ పేస్కేల్ ప్రకారం ఇస్తున్నామంటూ వారికి ఆ మేరకు జీతాలు చెల్లిస్తున్నామని రికార్డుల్లో చూపుతున్నారు. వారి ఏటీఎం కార్డులను యాజమాన్య ప్రతినిధులు తమ వద్దే ఉంచుకుని ఖాతాల్లో అధిక జీతం జమ చేసి ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసి రూ.50 వేలిచ్చి మిగిలిన మొత్తాన్ని తీసేసుకుంటున్నారు. ఎంటెక్, పీహెచ్‌డీ సర్టిఫికెట్లు ఇస్తే చాలు నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల జీతం ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి. ఒక్కరోజు వేలిముద్ర వేయకపోతే ఆరోజు జీతం కట్.

అక్రమాలు ఇలా.. ఉన్నత విద్యామండలి కార్యాలయానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్లు లేరు. కంప్యూటర్ సైన్స్‌లో సహాయ ప్రొఫెసర్లున్నట్టు హాజరు పట్టీలో ఉంటాయి. ఆ ప్రొఫెసర్లు బయోమెట్రిక్‌లో వేలిముద్రలు వేసి కళాశాలలో సాయంత్రం వరకూ ఉండి మళ్లీ వేలిముద్రలు వేసి వెళ్తున్నారు. పంజాగుట్ట-ఖైరతాబాద్-ఆబిడ్స్ మార్గంలో ఉన్న పురాతన ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రతినిధులు ఎంటెక్ పూర్తిచేసిన వారికి నెలకు రూ.18 వేలు ఇస్తూ ఉదయం, సాయంత్రం వేలిముద్రలు వేయించి పంపుతున్నారు. హైదరాబాద్ శివారులోని పర్యాటక ప్రాంతానికి, ఖరీదైన రిసార్టుకు సమీపంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. యాజమాన్యాలు సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీజీ చేసిన వారికి రూ.70 వేలు జీతం ఇస్తున్నట్టు రికార్డుల్లో చూపించి వారికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఇస్తున్నారు.

జేఎన్‌టీయూకు 15 కిలోమీటర్ల పరిధిలో 4 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి ప్రమాణాలకనుగుణంగా విద్యార్థుల ప్రొఫెసర్ల నిష్పత్తి లేదు. ఒక ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేసినవారే ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.

## పట్టాలెక్కనున్న పోడు!

పరిగి: పోడు భూములకు పట్టాలను అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే సమస్య పరిష్కారానికి కసరత్తు పూర్తిచేసింది. జూన్ 24నుంచి 30వ తేదీ వరకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వమే ముహూర్తాన్ని ఖరారు చేయడంతో పేదల చేతికి ఇక పట్టాలు అందనున్నాయి. భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కు పత్రాలను ఇస్తామని గతేడాది దరఖాస్తులను స్వీకరించిన సర్కారు క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి అర్హులను వడపోత పట్టింది. దీంతో రైతులు పత్రాల కోసం అప్పటి నుంచి నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో సర్కారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. వికారాబాద్ జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో పోడు సమస్య ఉంది. మొత్తం జిల్లా వైశాల్యం 8,85,683 ఎకరాలు ఉండగా అటవీ వైశాల్యం 1,08,791.08 ఎకరాలు. అటవీ బ్లాకుల సంఖ్య 93. ఏడాదిన్నర క్రితం జిల్లా వ్యాప్తంగా సుమారు 23వేల ఎకరాలకు గాను 9703 దరఖాస్తులు అందాయి. వీటిలో గిరిజనుల నుంచి 4,692 దరఖాస్తులు అందగా ఇతరుల నుంచి 5,011 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన వాటిని క్షేత్రస్థాయిలో జల్లెడ పట్టిన అధికారులు జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో చివరకు 436 మంది లబ్దిదారులను ఎంపిక చేశారు. వీరికి 552.30 ఎకరాల భూమిని ఖరారు చేసి పోడు పట్టాలను అందజేయనున్నారు. ఇందుకోసం అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా దశాబ్దాల తరబడి అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పోడు భూములు పట్టాలు పొందిన వారికి రైతుబంధు పథకం వర్తించనుంది. ప్రభుత్వమే బ్యాంకు ఖాతాలను తెరిచి యజమానులకు నేరుగా రైతుబంధును జమచేయనుంది. ఇకమీదట వారికి పంట రుణాలు కూడా అందనున్నాయి.

పది మండలాల్లో..: జిల్లాలోని 19 మండలాలు ఉండగా పోడు భూములకు పట్టాలను అందించేది పది మండలాల్లోని లబ్దిదారులకు. ప్రధానంగా యాలాల, పూడూరు, పెద్దేముల్, పరిగి, కుల్కచర్ల, కొడంగల్, దోమ, ధారూరు, చౌడాపూర్, బషీరాబాద్ మండలాలు ఉన్నాయి. దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉండగా లబ్ధిదారుల సంఖ్య అందులో సగానికి సగం కూడా లేకపోవడంతో ఎవరెవరికి అందుతాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు తెర

పోడు పట్టాల పంపిణీతో దశాబ్దాల సమస్యకు తెరపడనుంది. పంట సాగు చేసుకోవాలన్నా రుణం అందని పరిస్థితి. చివరకు అమ్ముకోవాలన్నా హక్కు పత్రాలు లేక పడుతున్న పాట్లు వర్ణనాతీతం. పంటసాగుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధుకు దూరమే. రైతుబీమా కూడా వర్తించకపోవడంతో బాధిత కుటుంబాలకు రూ.5లక్షల సాయం కూడా అందకుండా పోతోంది. కనీసం ఇప్పటికైనా తమకు మేలు కలుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా ఎంపిక

కోటాజి, జిల్లా గిరిజన సంక్షేమాధికారిగ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియను పూర్తి చేశాం. ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హులైన వారికి పోడు పట్టాలు అందనున్నాయి.

# ఖమ్మం.. నిప్పుల గుండం

ఖమ్మం : ఆకాశం నుంచి సూర్యుడు నిప్పులు కురిపించడంతో జిల్లా అగ్నిగుండంగా మారింది. రాష్ట్రంలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత నల్గొండ జిల్లా దామరచర్లలో 46.8 డిగ్రీలు నమోదవగా తరువాతి స్థానంలో నేలకొండపల్లిలో 46.6 డిగ్రీలు నమోదైంది. ముదిగొండ మండలం బాణాపురం, పమ్మిలో 46.3 డిగ్రీలు, ఖమ్మంలోని ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో 45.2, సత్తుపల్లిలో 45.1 డిగ్రీలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో 41 డిగ్రీల నుంచి 44.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతకాని మండలం నాగులవంచ, ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 44.9 డిగ్రీలు నమోదైంది. జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు పెరగటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. రోడ్లపై జన సంచారం తగ్గిపోయింది. మధ్యాహ్నం సమయంలో చాలా దుకాణాలు మూత పడ్డాయి. పగటి వేళ ఏసీల వినియోగం పెరిగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో... భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఎండ దంచి కొట్టింది. పాల్వంచ మండలం యానంబైలులో 45.4, కరకగూడెంలో 45.2, మణుగూరులో 45.1, దమ్మపేట మండలం నాయుడుపేటలో 44.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని అన్ని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో 40.7 డిగ్రీల పైగానే ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యుడి ప్రతాపానికి జన జీవనం జనం అల్లాడిపోయింది.

# అవసరాల నిధి.. అక్కరకు రాదేమి..!

నిజామాబాద్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సంక్షేమనిధి(జడ్పీ జీపీఎఫ్) ప్రభుత్వ అవసరాల బాంఢాగారంలా మారింది. గృహ నిర్మాణం, ఆరోగ్య సంబంధ, వివాహ శుభకార్యాలు, పిల్లల చదువులు తదితరాల కోసం జిల్లాపరిషత్‌లో జమ చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్ నుంచి కొంత రుణం లేదా పాక్షిక ఉపసంహరణలు చేసుకుందామని దరఖాస్తు చేసుకున్నవారు.. వాటి కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఈ మొత్తాన్ని సర్కారు వినియోగించుకోవడంతో సొమ్ము ఒకరిది...సోకు మరొకరిది అన్న చందంగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ప్రక్రియ ఇలా..ప్రతి ఉద్యోగి మూలవేతనంలో 6 శాతం ప్రావిడెంట్ ఫండ్ కింద జమ చేస్తారు(సీపీఎస్ ఉద్యోగులకు ఈ వెసులుబాటు లేదు). అవసరమైనప్పుడు అడ్వాన్సు రుణం కింద ఈ నిధిలో నుంచి 70–80 శాతం తీసుకోవచ్చు. 15 ఏళ్ల సర్వీసు పూర్తయిన వారికి ఆరోగ్య సంబంధమైన విషయాల్లో, 20 ఏళ్లు పూర్తయినవారు గృహ నిర్మాణ, వివాహాది శుభకార్యాలు, పిల్లల చదువుల కోసం పాక్షిక ఉపసంహరణలు చేసుకోవచ్చు.

ఇదీ పరిస్థితి

నిజామాబాద్ జిల్లాపరిషత్ పరిధిలో దాదాపుగా 15 వేల జీపీఎఫ్ ఖాతాలున్నాయి. వీటిలో ఉపాధ్యాయులకు సంబంధించినవి 5,500. గతేడాది నవంబరు నుంచి అడ్వాన్సు రుణం, పాక్షిక ఉపసంహరణలకై వచ్చిన దరఖాస్తులకు మోక్షం కలగడం లేదు. జిల్లాలో దాదాపుగా 600 మంది తమ సొమ్ముకై ఎదురుచూస్తున్నారు. అనధికార ఫ్రీజింగ్ కొనసాగడం, ఈ–కుబేరు వ్యవస్థతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. గతంలో దరఖాస్తు చేసుకున్న 1–2 నెలల్లోనే నగదు జమ చేసేవారు.

రూ.15 కోట్ల వడ్డీ బకాయిలు..

జడ్పీ జీపీఎఫ్‌కు సంబంధించి 2019–20 వరకు వార్షిక లెక్కల ప్రక్రియ పూర్తయింది. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలవి స్లిప్పుల ప్రక్రియ కొనసాగుతోంది. లి జిల్లా కార్యాలయంలోని ఈ విభాగంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో రెండు జిల్లాల ఖాతాల విభజన ప్రక్రియ ఇప్పటికీ సాగుతూనే ఉంది. లి జడ్పీ జీపీఎఫ్‌కు సంబంధించి వడ్డి సొమ్ము గత ఆరేళ్లుగా జమ కావడం లేదు. జిల్లాకు దాదాపుగా 15 కోట్ల వడ్డీ జమ కావాల్సి ఉంది.

త్వరగా మంజూరు చేయాలి

– నరేశ్, పీఆర్టీయూ నాయకుడు

చాలా మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు జీపీఎఫ్ రుణం అడ్వాన్సులకై నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా సొమ్ము మంజూరు చేయాలి. దరఖాస్తుల సీనియారిటీ ఆధారంగా ప్రక్రియ చేపట్టాలి.

# ఎంచక్కని బడులు.. గురువులే కొరత

ధన్వాడ : ధన్వాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం 967 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పతి 1:40 ఉండాలి దీని ప్రకారం ఆలోచిస్తే 25 మంది ఉపాధ్యాయులు అవసరం. జీహెచ్ఎంతో కలుపుకొని 16 మంది మాత్రమే ఉన్నారు. అయిదు పోస్టులు ఖాళీలు ఉన్నాయి. మక్తల్ బాలుర ఉన్నత పాఠశాలలో గత ఏడాది 680 విద్యార్థులు ఉన్నారు. మొత్తం 20 మంది ఉపాధ్యాయ పోస్టులు ఉండగా 16 మంది మాత్రమే ఉన్నారు. జిల్లాలో పలు చోట్ల ఏకోపాధ్యాయ ఒక్కరే తెలుగు, ఆంగ్లం బోధించలేక సతమతమవు



తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మన ఊరు–మన బడి కార్యక్రమంలో కార్పోరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు నేలపై కూర్చోకుండా బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్ బోర్డులతో పాటు డిజిటల్ పాఠాల బోధనకు వసతులు సమకూరుతున్నాయి. ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలు, ఆకర్షణీయమైన ఏకరూప దుస్తులు అందజేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇవన్ని బాగానే ఉన్న పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను మాత్రం భర్తీ చేయడం లేదు. కనీసం వాలంటీర్ల నియామకాలపై దృష్టి పెట్టడంలేదు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అంటే విద్యార్థుల సంఖ్య పెంచుకోవడం కాదని, ఉపాధ్యాయులు లేకుంటే ప్రయోజనం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వానికి నివేదించాంఖాళీలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న విషయాన్ని విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లి కొత్త పోస్టులు మంజూరు చేయాలని కోరాం. ఇవన్నీ విద్యాశాఖ పరిశీలనలో ఉన్నాయి.విద్యాసాగర్, ఏఎంవో, నారాయణపేట

# ప్రయోగం ఫలించేనా...?




ఖమ్మం : ఇంటర్ విద్యార్థులకు రాబోయే విద్యాసంవత్సరం నుంచి ఆంగ్లం సబ్జెక్టులోనూ ప్రాక్టికల్స్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటివరకు సైన్స్, వృత్తి విద్యాకోర్సుల సబ్జెక్టులకే పరిమితమైన ప్రయోగాలు తొలిసారిగా ఆంగ్లం సబ్జెక్టులోనూ అమలుచేయాలని భావిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మాతృభాష(తెలుగు)కే విద్యార్థులు ప్రాధాన్యమిస్తుండటంతో డిగ్రీలు, పీజీలు, వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారు సైతం ఆంగ్లంలో ప్రావీణ్యం సంపాదించలేకపోతున్నారనే వాదనలున్నాయి. విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేందుకు ప్రాక్టికల్స్ దోహదపడతాయని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందేనా..?

90వ దశకానికి ముందున్న బోధన పద్ధతులు ఇప్పుడు లేకపోవటంతో భాషా సామర్థ్యాలపై గణనీయమైన ప్రభావం పడుతోంది. తెలుగులో వర్ణమాలతో ప్రారంభించటం మొదలుకొని వాక్యనిర్మాణం వరకు సులభమైన బోధన పద్ధతులు అనుసరించేవారు. ఆంగ్లంలోనూ తొలుత ఏబీసీడీలను నేర్పి పదోతరగతి దాకా వ్యాకరణం, వాక్యనిర్మాణంపై తర్ఫీదు ఇచ్చేవారు. ఈ విధానానికి స్వస్తి పలికి నేరుగా వాక్యనిర్మాణంపై దృష్టిపెట్టటం విద్యార్థుల్లో అయోమయాన్ని సృష్టించింది. కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ చదువులు మరింత గందరగోళానికి గురిచేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో పదోతరగతి వరకు కనీస ఆంగ్ల పరిజ్ఞానంతో చదివే విద్యార్థులు.. ఇంటర్‌లో పట్టణ ప్రాంత విద్యార్థులతో ప్రాక్టికల్స్‌లో పోటీపడటం ఇబ్బందికరంగా మారొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2015 నుంచి ప్రయోగ పరికరాలు సరఫరా కావటం లేదని, ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సైన్స్, ఒకేషనల్ ప్రయోగాలే సరిగ్గా జరగటం లేదనే వాదనలూ వినిపిస్తున్నాయి.

పరిశీలకులను ప్రసన్నం చేసుకుంటేనే..

ఇంటర్ ఆంగ్ల సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. విద్యార్థులు భాషపై పట్టు సాధించేందుకు తరగతి గదుల్లో ఎక్కువ సాధన చేయించాలి. ఇంటర్ ప్రారంభం నుంచే ఈవిషయంపై తర్ఫీదు ఇవ్వటం మంచిది. ప్రధానంగా గ్రామీణ విద్యార్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రయోగ పరీక్షలు ఉపయోగపడతాయి.

కేఎస్ రామారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఖమ్మం

ఇంటర్ ఆంగ్ల సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. విద్యార్థులు భాషపై పట్టు సాధించేందుకు తరగతి గదుల్లో ఎక్కువ సాధన చేయించాలి. ఇంటర్ ప్రారంభం నుంచే ఈవిషయంపై తర్ఫీదు ఇవ్వటం మంచిది. ప్రధానంగా గ్రామీణ విద్యార్థులకు ఆంగ్లభాషలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రయోగ పరీక్షలు ఉపయోగపడతాయి.కేఎస్ రామారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఖమ్మం

# రాచకొండకు పూర్వ వైభవం వచ్చేనా?



చౌటుప్పల్ : హైదరాబాద్‌కు యాభై కిలోమీటర్ల దూరంలోనే ఉన్న రాచకొండ.. 14వ శతాబ్దంలో 115 ఏళ్లపాటు రాజధానిగా కొనసాగినందున ఓ గొప్ప పర్యాటక కేంద్రంగా మారే బదులు 'అనాథ'లా మారింది. ఎందరో వీరులకు, కవులు, కళాకారులకు నిలయమై జనరంజకంగా పాలన సాగిన రేచర్ల 'పద్మనాయక పాలన బహమనీ సుల్తానుల దండయాత్రతో 1475లో అంతమైందని, బహమనీల గవర్నర్‌గా నియమితుడైన శితాబ్‌ఖాన్ సైతం రాచకొండను కేంద్రంగా చేసుకుని పాలించాడని చరిత్రకారుల మాట. ఇంతగొప్ప రాచరిక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వమున్న రాచకొండను తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొలి సంవత్సరంలోనే 2014 డిసెంబరులో సీఎం కేసీఆర్ సందర్శించారు. ఆనాటి చారిత్రక కట్టడాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వేలో ఆయన వీక్షించారు. సుమారు పది వేల ఎకరాల్లో విస్తరించిన ఒకనాటి తెలుగు రాజులు పాలించిన రాచకొండకు కేసీఆర్ పూర్వ వైభవం తెస్తారని ఎనిమిదేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.శత్రు దుర్భేద్యంగా నిర్మించిన రాచకొండ కోట చుట్టూ చైనా గోడను తలపించే విధంగా గుట్టలను కలుపుతూ భారీ రాళ్లతో నిర్మించిన ప్రాకారాలు ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. ఆరొందల అడుగుల ఎత్తయిన కచేరీ కొండపై నిర్మించిన రాజస్థానాన్ని చేరాలంటే ఏడు ద్వారాలను, వాటికి పహారా ఉండే సైనికులను దాటుకుని వెళ్లేలా నిర్మించిన రక్షణ వ్యవస్థ అబ్బుర పరుస్తుంది. కొండపైకి వెళ్లేందుకు రాతితోనే నిర్మించిన మెట్లు ఇప్పటికీ ఆనవాళ్లుగా మిగిలాయి. పద్మనాయకులు వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారని, పంటలకు నీటి వనరుల కోసం ఆనాడు తవ్వించిన చెరువులు అనపోత సముద్రం, రాయ సముద్రం, నాగసముద్రం నేటికీ జలాలతో నిండుగా ఉండడం విశేషం. పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని సీమలుగా విభజించి దుర్గాధిపతులను నియమించారు. దేవరకొండ దుర్గాన్ని, దేవాలయాలను నిర్మించారు. పద్మనాయకుల పాలనలో వస్త్రాల తయారీ, కలంకారీ, అద్దకపు పరిశ్రమ కూడా ఉండేది. ఇంత గొప్ప చారిత్రక వారసత్వాన్ని రక్షించే ప్రయత్నాలు ఇక్కడ జరగడం లేదు.

కవులు, కళాకారులకు నిలయం

రాచకొండ రాజ్యంలో సంస్కృత భాషకు ఆదరణ ఉండేది. పద్మనాయకుల ఆస్థానంలో కొలువుదీరిన తెలుగు కవుల్లో గౌరన, పోతన ప్రసిద్ధులు. పోతనామాత్యులు రాజు కోరికపై భోగినీ దండకం రచించారు. పరమేశ్వరార్పణగా మహాభాగవత రచన ప్రారంభించారు. ఆ కావ్యాన్ని రాజుకు అంకితమివ్వడానికి నిరాకరించారు. రాజాస్థానాన్ని ఆశ్రయించి జీవించుట హేయమని భావించి జన్మస్థలం బమ్మెర చేరి హాలిక వృత్తిలో జీవించారు. మహాకవి శ్రీనాథుడు రాచకొండను సందర్శించి సన్మానం పొందారు. ఇక్కడ కవులకు, కళాకారులకు గౌరవముండేది. రాచకొండ రాజ్యంలో అంతర్భాగంగా ఉండే గోలకొండ, భువనగిరి, ఓరుగల్లు, పోతన జన్మస్థలం బమ్మెర తదితర ప్రదేశాలను చారిత్రక వారసత్వ సంపదగా గుర్తించి ప్రభుత్వం పర్యటక కేంద్రాలుగా అభివృద్ధి పరుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశమ వార్షికోత్సవాల సందర్భంగానైనా రాచకొండ ప్రాభవాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# రాగల 15 రోజుల్లో..!

చౌటుప్పల్ : రబీ సీఎంఆర్ బియ్యం బకాయిలు 2021–22 సంవత్సరానికి సంబంధించి 15 రోజుల్లో ఇవ్వాలని ఆదేశాలు జారీ చేస్తూ చరవాణి సందేశాలు పంపించారు. గతంలో నెల రోజులు పెంచి ప్రత్యేకంగా సర్క్యులర్ విడుదల చేసేవారు. ఈసారి మాత్రం కేవలం 15 రోజులు మాత్రమే అవకాశం కల్పిస్తూ అదీ 125 శాతం జరిమానాతో చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు కూడా చరవాణి సందేశం ద్వారా పంపించారు. ఉన్న బకాయిలు వెంటనే పూర్తి చేయాలని ఆ సందేశంలో పేర్కొన్నారు. వాస్తవానికి మే 31 నాటికి మిల్లర్లందరూ తమ బకాయిలు చెల్లించాల్సి ఉంది, కానీ ఇంకా చెల్లింపులు అలాగే ఉండటంతో చివరి అవకాశంగా పౌర సరఫరాలశాఖ అధికారులు ఇలా ఆదేశాలు జారీ చేశారు. దీన్ని అత్యంత ప్రాధాన్యం గల విషయంగా తీసుకోవాలని వారి సందేశంలో తెలిపారు.ఇలా అనుకున్నారు..లక్ష్యం మేరకు బియ్యం ఇవ్వని మిల్లులో ఉన్న ధాన్యం స్వాధీనం చేసుకోవాలని మొదట నిర్ణయించారు. గత సంవత్సరం బకాయిలు ఉన్న జిల్లాలోని 49 మిల్లులకు నోటీసులు జారీ చేశారు. వెంటనే బియ్యం ఇవ్వని మిల్లులకు జరిమానాలతో పాటు, మిల్లుల్లో ఉన్న ధాన్యం స్వాధీనం చేసుకుంటామని అప్పుడు హెచ్చరికలు జారీ చేశారు. ఈ హెచ్చరికలకు కొందరు మిల్లర్లు స్పందించి కొంత మేర బియ్యం ఇచ్చారు. నోటీసులు, హెచ్చరికలు జారీ చేసి ఆరు నెలలు కావొస్తున్నా కొందరు మిల్లర్లు పట్టించుకోవడం లేదు. దీంతో జిల్లాలో ఇంకా 29,242 మెట్రిక్ టన్నుల బియ్యం పెట్టాల్సి ఉంది. వీటి విలువ దాదాపు రూ.100 కోట్లు. నల్గొండ, యాదాద్రి జిల్లాల నుంచి స్పందన ఉన్నా సూర్యాపేట జిల్లా నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో అధికారులు చివరి అవకాశం అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

బకాయిల పరిస్థితి ఇలా..నల్గొండ జిల్లా నుంచి 2,21,669 మెట్రిక్ టన్నులు 2021–22 రబీకి ఇవ్వాల్సి ఉండగా పూర్తిగా ఇచ్చి రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంది. యాదాద్రి జిల్లా 1,40,807 మెట్రిక్ టన్నులు పెట్టాల్సి ఉండగా.. ఇంకా 495 మెట్రిక్ టన్నులు మిగిలి ఉంది. సూర్యాపేట జిల్లా నుంచి 1,44,904 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా గత నెల 19 వరకు 1,15,662 మెట్రిక్ టన్నులు బియ్యం పెట్టారు. అన్ని జిల్లాల నుంచి కొంత మేర స్పందన ఉన్నా సూర్యాపేట జిల్లా మిల్లర్లు కొందరు మొండిగా తయారు కావడం వెనక అధికారుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. 2021–22 రబీ బకాయిల వసూలుకు అధికారులు నానా తంటాలు పడుతుండగా, 2022–23 వానాకాలం సీఎంఆర్ బియ్యం లక్ష్యాలు కూడా ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లా నుంచి వానాకాలం 23,229 మెట్రిక్ టన్నుల బియ్యం (11శాతం) మాత్రమే ఇచ్చారు. నల్గొండ జిల్లా 54 శాతం, యాదాద్రి జిల్లా 32 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశాయి.

# చెరువులు కప్పేస్తూ కట్టడాలు


కామారెడ్డి: నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో చెరువులు అన్యాక్రాంతమవుతున్నా.. అడ్డుకునేవారు లేరు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు వెలుస్తున్నా.. అడిగేవారుండరు. పురపాలకశాఖ ఏమీ చూడకుండా ఇంటి నంబర్లు జారీ చేస్తోంది. వాటిని అడ్డంపెట్టుకొని విద్యుత్తు కనెక్షన్లు తీసుకుంటున్న పరిస్థితి ఉంటోంది. బఫర్ జోన్ నిబంధనలు, జలవనరులశాఖ నుంచి నిరభ్యంతర పత్రాలు లేకుండానే కానిచ్చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం ఆక్రమణలకు బలం చేకూరుస్తోంది.

కబ్జా కోరల్లో

నిజామాబాద్ నగరం నాగారం పరిధి సర్వే నంబరు 2999లోని బొందెం చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఏడాదిన్నర కిందట జలవనరుల, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు చుట్టూ హద్దుగా కందకం తవ్వించినా.. అది పూడుకుపోయింది. రెండు దిక్కులా బండరాళ్ల గుట్ట ఉంది. మిగతా రెండు వైపులా నిర్మాణాలు వెలవడంతో 23.7 ఎకరాల ఈ జలవనరులోకి నీరు చేరే అవకాశమే లేకుండా పోయింది. ఫలితంగా పిచ్చిమొక్కలతో మైదాన ప్రాంతంగా మారింది. ఈ క్రమంలోనే చుట్టుపక్కల నిర్మాణాలు విస్తరించుకుంటూ శిఖంలోకి చొచ్చుకొస్తున్నాయి.

నిబంధనల ఊసేది..?

ఇంటి నిర్మాణాల అనుమతి జారీలో నిబంధనలు పాటించటం లేదు.



ఇష్టానుసారం డోర్ నంబర్లు జారీ చేస్తున్నారు. విద్యుత్తుశాఖ పూర్తిస్థాయి అనుమతిలేని నిర్మాణాలకు కనెక్షన్లు జారీ చేస్తోంది. నిజానికి నీటివనరులున్న ప్రాంతాల్లో 9 మీటర్ల దూరం వరకు ఎటువంటి కట్టడాలకు అనుమతివ్వవద్దు. జలవనరులశాఖ నుంచి నిరభ్యంతర పత్రం జత చేయాల్సి ఉంటుంది. అలాంటివి లేకుండానే మున్సిపల్ వారు అనుమతులిస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అంతులేకుండా పోతోంది.సమన్వయం మాటే లేదు..

బొందెం చెరువు ప్రాంతంలో గతంలో హద్దులు నిర్ణయించి ట్రంచ్ కొట్టించామని దక్షిణ మండలం తహసీల్దారు ప్రసాద్ చెప్పారు. ఇక్కడ చేపట్టే నిర్మాణాలకు మున్సిపల్ వారు నిబంధనలు చూసి అనుమతిలివ్వాలన్నారు. జలవనరులశాఖ నిరభ్యంతర పత్రం తప్పనిసరి అని తెలిపారు. వారే చెరువు పరిరక్షణకు ఫెన్సింగ్ చేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నీటిపారుదలశాఖ అధికారి రాజ్యలక్ష్మి స్పందిస్తూ... తాము ఎవరికీ నిరభ్యంతర పత్రాలు ఇవ్వటం లేదని చెప్పారు. నిర్మాణాలు చేపట్టడం, విద్యుత్తు లైన్లు వేయటం అనేది మున్సిపల్, విద్యుత్తుశాఖల వారు నిబంధనలు చూసి ఇవ్వాలని చెప్పుకొచ్చారు.

మరిన్ని ఉదంతాలు..నిజామాబాద్ శివారులోని రామర్తి చెరువులోకి నిర్మాణాలు వచ్చేశాయి. నిద్ర నుంచి మేల్కొన్న అధికారులు వాటిని ఏమీ చేయలేక.. మిగిలిన భాగాన్నైనా కాపాడేందుకు ఫ్రెన్సింగ్ వేయించారు. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోవడం వల్ల వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో తక్కువ సమయంలోనే నిండిపోయి నిజామాబాద్–బోధన్ రహదారిపైకి నీరు చేరుతోంది. : భీమ్‌గల్ పట్టణానికి ఆనుకొని ఉన్న రాథం, మొగిలి చెరువులది ఇదే పరిస్థితి. రాథం 72 ఎకరాల విస్తీర్ణం ఉండగా.. 20 ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. ఇటీవల సర్వే చేయించిన రెవెన్యూ యంత్రాంగం తదుపరి చర్యలను మరిచింది. మొగిలి విస్తీర్ణం కాగితాలకే పరిమితమైంది. సింహభాగం నిర్మాణాలు వెలిశాయి. : మాక్లూర్ మండలం గుత్ప ప్రాంతంలోని మూడు చెరువులు 100, 60, 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఖజానా చెరువులో 20 ఎకరాలు, నడి, పెచ్చెరువుల్లో పదేసి ఎకరాలు కబ్జాకు గురయ్యాయి.

# గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు వేళాయె!

మహబూబ్‌నగర్: తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడి యట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. కార్పొరేట్ స్థాయి నాణ్యమైన ఉచిత విద్యతోపాటు క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, అధునాతన సౌకర్యాలతో పాటు పౌష్టికాహారం అందించనున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ ఏడాది నిర్వహించిన పదోతరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులు. రాష్ట్రవ్యాప్తంగా 103 కళాశాలలుండగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో బాలికలు ఆరు, బాలురకు మూడు చొప్పున మొత్తం 9 గిరిజన గురుకుల కళాశాలల్లో 680 సీట్లున్నాయి. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీతో పాటు వృత్తివిద్యా కోర్సుల్లో ఆంగ్ల మాధ్యమంలోనే బోధన నిర్వహించనున్నారు.

పదో తరగతి జీపీఏ ఆధారంగా ఎంపిక.. : తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉ



ంటుంది. ఈ నెల 15 దరఖాస్తులకు తుది గడువుగా విధించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు మించరాదు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లలోపు ఉండాలి. ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల గరిష్ఠ వయో పరిమితి అవకాశం ఉంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ఒక్కో కళాశాలలో 40 సీట్లు ఉంటాయి. ఇందులో ఎస్టీలకు 34, జనరల్/ఈబీసీ, బీసీ, ఎస్సీ, అనాథలు, దివ్యాంగులు, క్రీడాకారులకు ఒక్కో సీటును రిజర్వు చేశారు. 30 సీట్లు ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఎస్టీలకు 24, ఇతర విభాగాల్లో ఒక్కో సీటు కేటాయించారు. 20 సీట్లు ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఎస్సీలకు 14, ఇతర విభాగాలకు ఒక్కో సీటు రిజర్వు చేశారు. పదోతరగతి జీపీఏ ఆధారంగా ఎంపిక చేస్తారు. సందేహాలుంటే ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త నాగార్జున చరవాణి నం. 77803 75773, హెల్ప్‌లైన్ నం. 91211 74434 ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

గరుడ వార్త



# గతం కంటే మెరుగు..'సాంకేతిక బోధన'తోనే పెరుగు

కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, బోధనలో నాణ్యత తదితర అంశాలను పరిశీలించిన కేంద్ర విద్య, అక్షరాస్యత శాఖ వారం క్రితం పెర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండెక్స్(పీజీఐ)ను విడుదల చేసింది. 2018-19, 19-20 విద్యా సంవత్సరాల 'యూ డైస్', న్యాస్ సర్వే, ఇతర అధ్యయనాలు, నివేదికలతో పాటు ఆ శాఖ స్వయం పరిశీలన జరిపించింది. వీటి ఆధారంగా పీజీఐ గ్రేడ్‌లు ప్రకటించగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు గతంకంటే మెరుగైన స్థానంలో నిలిచాయి. సాపేక్ష సూచిక స్థాయికి సమీపానికి చేరడం విశేషం.

పది శాతం మెరుగ్గా..యూడైస్‌ం (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్), నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) నివేదికలను గ్రేడ్‌ల ప్రకటనకు ప్రాతిపదికగా తీసుకున్నారు. అభ్యసనా సామర్థ్యం-నాణ్యత (ఎల్‌అండ్‌క్యూ), ఉపాధ్యాయుల లభ్యత, వృత్తిపరమైన అభివృద్ధి ఫలితం (పీడీవో), లెర్నింగ్ మేనేజ్‌మెంట్ (ఎల్.ఎమ్.), నేర్చుకోవడంలో సుసంపన్న కార్యకలాపాలు (ఎల్ఈఏ) వంటి అంశాలను సునిశితంగా పరిశీలించారు. మొత్తం పది గ్రేడ్‌లు ప్రకటించారు. వీటిలో ఖమ్మం సుమారు 70% మార్కులతో, భద్రాద్రి జిల్లాల 61 శాతం మార్కులతో 'ఉత్తమ్' స్థాయిలో నిలిచాయి. 2018-19 సంవత్సరంతో పోల్చుకుంటే 19-20లో ఉభయ జిల్లాల్లోని పాఠశాలల్లో ప్రమాణాలు 10 శాతం మెరుగైనట్లు తాజా సర్వే తేలింది. మార్కులు తక్కువగా ఉన్న అంశాల్లో దృష్టి కేంద్రీకరిస్తే మెరుగైన స్థానంలో నిలిచే వీలుంది.

'మన ఊరు - మనబడి'తో..



రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో 'మన ఊరు -మన బడి' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించింది. ప్రభుత్వ విద్యాలయాల్లో సకల వసతులు కల్పించడమే దీని ముఖ్యోద్దేశం. పాఠశాలల్లో అభివృద్ధి పనులన్నీ నాణ్యంగా, వేగంగా పూర్తిచేయడంతో పాటు డిజిటల్ బోధనా తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలో మరింత బలోపేతం చేయడం ద్వారా వచ్చే సంవత్సరం పీజీఐ గ్రేడ్‌ను పైస్థాయికి పెంపొందించుకునే అవకాశం ఉంది. ఇందుకోసం అవసరమైతే స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలి. ?

మొత్తం 368 పాఠశాలల్లో 1,278 సమస్యల్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గుర్తించి అంచనాలు రూపొందించారు. దశల వారీగా పరిష్కార చర్యలు కొనసాగుతున్నాయి.

విద్యుత్తు 364, తాగునీరు 358, భవన మరమ్మతులు 368, భోజనశాలలు(ఉన్నత పాఠశాలల్లో) 58, ప్రహరీలు 30, వంటషెడ్లు 16, మూత్రశాలలకు చెందిన 32 సమస్యల్ని పరిష్కరించే పనిలో అధికార యంత్రాంగం ఉంది.

పీజీఐ సర్వేలో భద్రాద్రి జిల్లా స్థానం గతంకన్నా మెరుగ్గా ఉంది. పాఠశాలల్లో భద్రత, విద్యార్థుల రక్షణలో ముందు వరుసలో నిలిచింది. పాలనలోనూ ప్రదర్శన కనబరిచాం. ప్రభావవంతమైన తరగతి గదుల రూపకల్పనలో 2018తో పోలిస్తే మార్పు స్పష్టంగా కనిపించింది. తాజాగా 'మన ఊరు -మనబడి' కార్యక్రమంలో యుద్ధప్రాతిపదికన వసతులు మెరుగుపరుస్తున్నాం. డిజిటల్ తరగతులపై దృష్టిసారించాలి. రానున్న రోజుల్లో విడతల వారీగా డిజిటల్ బోధనపై శ్రద్ధచూపుతాం.
- అనుదీప్, కలెక్టర్, భద్రాద్రి

# కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారంలో వార్షిక మరమ్మతులు

కొత్తగూడెం : పాల్వంచ కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం గల 12వ యూనిట్‌లో వార్షిక మరమ్మతులు నేటి(శనివారం) నుంచి ప్రారంభంకానున్నాయి. 2018లో విద్యుత్కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభించారు. 2019, నవంబరులో తొలిసారి వార్షిక మరమ్మతులు చేశారు. అప్పట్లో యూనిట్ అందుబాటులో రావడానికి ఏకంగా ఆరు నెలల సుదీర్ఘ కాలం పట్టింది. అప్పట్లో జెన్కోపై రూ.కోట్లల్లో భారం పడింది. మళ్లీ ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికతో వార్షిక మరమ్మతులకు ప్రణాళికలు చేపడుతున్నారు. ఈ యూనిట్‌కు రెండో దఫా జనవరి 15 నుంచి ఓవరాలింగ్ చేయాలి. కానీ వేసవి డిమాండ్‌తో జూన్ 15కి వాయిదా వేశారు. ఈ గడువూ ముగిసింది. చివరకు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే



కేటీపీఎస్ అయిదో దశ తొమ్మిదో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో రాష్ట్ర గ్రిడ్‌కు ఒక్క కేటీపీఎస్ నుంచే 1,050 మెగావాట్ల విద్యుత్తు సరఫరా నిలిచిపోనుంది.

బీహెచ్ఈఎల్‌కు బాధ్యత

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్)కు వార్షిక మరమ్మతుల బాధ్యతను జెన్కో అప్పగించింది. ప్రధానంగా టర్బైన్, జనరేటర్, బాయిలర్, యాష్‌పాండ్ విభాగాలకు సంబంధించిన పనులు నిర్వహించడానికి రూ.5 కోట్లు కేటాయించారు. 45 రోజుల గడువుతో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం టర్బైన్ బేరింగ్‌లలో సాంకేతిక సమస్య ఏర్పడింది. జనవరిలోనూ వారం రోజుల పాటు ఉత్పత్తి నిలిపేసి మొదటి బేరింగ్ సమస్య పరిష్కరించారు. ప్రస్తుతం ఎల్‌పీ టర్బైన్‌ను బయటకు తీసి, హైదరాబాద్ పంపించి ప్రకంపనాల(వైబ్రేషన్) స్థితిని సరిచేసి తీసుకురానున్నారు. మరోవైపు బాయిలర్ ట్యూబ్ లీకు సమస్య వేధిస్తోంది. ఆయా పనుల పూర్తికి కేటీపీఎస్ యాజమాన్యం ఉత్తరాఖండ్, జర్మనీ, దిల్లీ, హైదరాబాద్ నుంచి నిపుణుల త్వరలో రప్పించనుండగా.. ఇప్పటికే ప్లాంటు ఇంజినీరింగ్, ఆర్టిజన్లను సమాయత్తం చేసింది. 'శనివారం ఉదయం నుంచి ఉత్పత్తి ఆపేస్తాం. నెలన్నరలోగా బీహెచ్ఈఎల్, ప్లాంట్ ఇంజినీర్ల, ఇతర ఉద్యోగులు కలిసి యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి సిద్ధం అయ్యామని' సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.

# గుడుంబా తయారీకి వక్రమార్గాలు



ములుగు : గుడుంబా మహమ్మారి గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. తయారీదారులు లాభార్జనే ధ్యేయంగా అనేక రకాల రసాయనాలను వినియోగిస్తున్నారు. అధికారులు ఆంక్షలు విధిస్తున్నా తయారీ ప్రక్రియను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గుడుంబా దందా గుట్టుగా సాగుతోంది.

బెల్లంకు ప్రత్యామ్నాయంగా చక్కెర

సాధారణంగా ఇప్పపూలు, నల్లబెల్లంతో గుడుంబా తయారు చేస్తుంటారు. అధికారులు సైతం నల్లబెల్లం క్రయ, విక్రయాలపైనే దృష్టిసారిస్తుంటారు. అధికారులను ఏమారుస్తూ ఇటీవల కాలంలో గుడుంబా తయారీకి చక్కెర వినియోగిస్తున్నారు. మార్కెట్లో కిలో బెల్లం ధర రూ.70కి పైగా ఉండగా చక్కెర రూ. 40 మాత్రమే ఉంది. క్వింటా బెల్లంతో 65 నుంచి 70 లీటర్ల గుడుంబా తయారవుతుంది. అదే క్వింటా చక్కెరతో 140 నుంచి 160 లీటర్ల గుడుంబా తయారవుతుందని తయారీదారులు చెబుతున్నారు.

యూరియా, అమ్మోనియం వినియోగం

గతంలో గుడుంబా తయారీకి బెల్లంతో పటికను కలిపేవారు. అధికారులు ఉక్కుపాదం మోపడంతో పటిక ఎక్కడా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో బెల్లం పటికకు బదులు అమ్మోనియం కలుపుతున్నారు. ఒక్కోసారి అమ్మోనియం దొరకకపోవడం, ధర ఎక్కువగా ఉండటంతో యూరియాను వినియోగిస్తున్నారు. ఇవే కాకుండా బేకరీలలో ఆహార పదర్థాలు ఎక్కువ రోజులు నిలువ ఉండేందుకు వినియోగించే ఈస్ట్‌పౌడర్‌తో పాటు మరో రసాయనాన్ని కూడా కలుపుతున్నట్లు తెలిసింది.

ఘాటు కోసం స్పిరిట్

ఇటీవల కాలంలో గుడుంబాలో ఘాటు తగ్గిపోతోంది. ఇప్పపూలు వాడకపోవడం, పటిక దొరకకపోవడంతో గుడుంబా చప్పగా ఉంటుంది. దీనిపై తయారీదారులు ప్రత్యేక దృష్టిసారించారు. ప్రతి ఐదు లీటర్ల గుడుంబాలో 100 ఎంఎల్ స్పిరిట్ కలుపుతున్నారు. దీనివల్ల ఘాటుగా ఉండటంతో పాటు ఎక్కువ మత్తు వచ్చే అవకాశముంది.

ఒకప్పుడు గుడుంబా తయారీ కష్టంగా ఉండేది. బెల్లం పానకం తయారు చేసి కుండల్లో సారాయి కాచడానికి వారం, పది రోజుల వ్యవధి పట్టేది. ప్రస్తుతం స్టీలు పాత్రల్లో బెల్లం, రసాయనాలు కలిపి విద్యుత్తు వాటర్ హీటర్లతో వేడి చేసి చల్లార్చి ప్లాస్టిక్ డ్రమ్ములలో మూడు రోజులు మాత్రమే పులియబెట్టి గుడుంబా తయారు చేస్తున్నారు. ఇందుకోసం ఉచిత వ్యవసాయ విద్యుత్తును వినియోగించుకొంటున్నారు.

గత ఆరు నెలల్లో ములుగు ఎక్సైజ్ సర్కిల్‌లో నమోదైన కేసుల వివరాలు

దర్జాగా వ్యాపారం

పల్లెల్లో గుడుంబాను నియంత్రించే నాథుడే కరవయ్యాడు. ప్రతి గ్రామంలో ఐదు నుంచి 10 అమ్మకం కేంద్రాలు వెలిశాయి. ప్రధానంగా గిరిజన తండాలలో తయారు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఉదాహరణకు తాడ్వాయి మండలం నార్లాపురంలో కొంతమంది గుడుంబా తయారు చేసి సమీప గ్రామాలకు వెళ్లి చిరువ్యాపారులకు లీటరుకు రూ. 60 చొప్పున విక్రయిస్తున్నారు. చిరువ్యాపారులు రెండింతలు లాభంతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఎక్కువగా గుడుంబాకు బానిసలవుతున్నారు. మద్యం ధరలు పెరగడంతో దీనికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల ప్రేక్షకపాత్ర

గుడుంబాను నివారించాల్సిన ఎక్సైజ్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఐదారు మండలాలకు ఒకే ఎక్సైజ్ స్టేషన్ ఉండటం, సిబ్బంది తగినంత లేకపోవడం వంటి కారణాల వల్ల గుడుంబా నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. గుడుంబా తయారిదారులను పట్టుకుని కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. ఆ తర్వాత వారు అదే వృత్తిని కొనసాగిస్తున్నారు.

# వ్యాధులు ప్రబలకుండా..



భూపాలపల్లి : గత కొన్ని రోజుల క్రితం వరుణుడు జిల్లాపై ప్రతాపం చూపాడు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక వర్షాలు పడడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా గ్రామాల్లో ఇళ్లలోకి వరద చేరడంతో పునరావాస కేంద్రాలకు తరలించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వానలు తగ్గుతుండడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. అధిక వర్షాల అనంతరం పరిసరాలు చిత్తడిగా తయారై అపరిశుభ్రంగా ఉండటంతో చాపకింద నీరులా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. దీంతో జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తమై పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా జులై 24 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పారిశుధ్యమే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేశారు.

10 రోజుల ప్రత్యేక కార్యచరణ

జిల్లాలోని 241 గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పదిరోజుల ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఆయిల్‌బాల్స్ తయారు చేస్తున్నారు. చెక్కపొట్టు, వరి పొట్టును గుడ్డలో చుట్టి ఒకరోజు ముందుగా ఇంజిన్ ఆయిల్‌లో వేసి తర్వాత రోజు నిల్వ ఉన్న నీటిలో వేస్తున్నారు. దీంతో నీటిలో ఆయిల్ పేరుకుపోయి నిల్వ నీటిలో ఉన్న దోమ లార్వా చనిపోతుండడంతో ఎక్కువగా ఈ పద్ధతినే పాటిస్తున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీలో ఫాగింగ్ యంత్రాలు, స్ప్రే యంత్రాలతో దోమల మందును పిచికారి చేస్తున్నారు. నిత్యం మురుగు కాల్వల శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, లోతట్టు ప్రాంతాల్లోని నీటి నిల్వలను తొలగించడం, ప్రతి వారం మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం, శుక్రవారం డ్రైగే పాటించేలా, అంటువ్యాధులు సోకకుండా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి చేస్తున్నారు.

ఉదయం 7 గంటలకే విధులు

పారిశుధ్యం పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం 7 గంటలలోపు గ్రామాల్లో ఉండి పారిశుధ్య పనులు పర్యవేక్షించేలా ఆదేశాలున్నాయి. ఉదయం 7 గంటలకు గ్రామంలో డైలీ శానిటైజేషన్ రిపోర్టు (డీఆర్ఎస్)లో హాజరు నమోదు చేయాలి. అలాగే డీఆర్ఎస్ యాప్ ద్వారా లైవ్ ఫోటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులకు సెలవులను రద్దు చేశారు. గ్రామాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జ్వర సర్వేలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొని ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రతి మండలం, గ్రామపంచాయతీలకు గతంలో నియమించిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కూడా నిత్యం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి- ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 241 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ముఖ్యంగా దోమల నివారణకు నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం తదితర పనులు చేపడుతున్నాం. 10 రోజుల ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతున్నాం.

# సేవే పరమావధిగా.. బాధితులకు అండగా

ఏటూరునాగారం : వరంగల్‌కు చెందిన శ్రీషిరిడీ సాయి సేవా ట్రస్టు సభ్యులు ఏటూరునాగారంలోని ఆచార్యనగర్ కాలనీలో 120, నందమూరినగర్‌లో 20, రాంనగర్ (కోయగూడ ఎల్లాపూర్)లో 40 పేద కుటుంబాలకు సాయం చేశారు. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయ ఆచార్యుడు డా.తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు బ్రహ్మదేవర లలిత, యాంసాని మధులిక, మడూరి రమ, కూరగాయల శ్రీలక్ష్మి, ఇల్లూరి సరిత, అమెరికాలో ఉండే వజనపల్లి వంశీకృష్ణ సంయుక్తంగా ఈ సాయమందించారు. వంట పాత్రలు, దుప్పట్లు, పులిహోరా పొట్లాలు పంపిణీ చేశారు. 50 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ట్రస్టు సభ్యురాలు లలిత మాట్లాడుతూ.. పేదలకు తమ వంతుగా ఏదైనా స్వచ్ఛందంగా సాయమందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి: -డా.తుమ్మ ప్రభాకర్‌రెడ్డి

సాయమందించడంలో ఉన్న ఆనందం వేరే ఎందులో లేదని మా తల్లిదండ్రులు తుమ్మ సాయిరెడ్డి, కోమల నేర్పించారు. 'ఈనాడు' ఇచ్చిన స్ఫూర్తితో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని పెంపొందించుకోవాలి.

నిత్యావసర సరకులు..

భూపాలపల్లి మండలం రాంపూర్ శివారు చికినపెల్లి గ్రామంలో ఇళ్లు కోల్పోయిన 9 బాధిత కుటుంబాలకు మండల రెవెన్యూ అధికారులు బాసటగా నిలిచారు. ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యంతో పాటు పప్పులు, ఇతర నిత్యావసర సరకులు అందజేశారు. పంపిణీ చేసిన సరకుల విలువ రూ.9 వేల వరకు ఉంటుంది. 'ఈనాడు' పిలుపు మేరకు తమవంతు ఆర్థిక సాయం చేసినట్లు తహసీల్దారు మహ్మద్ ఇగ్బాల్, ఆర్ఐ రామస్వామి, వీఆర్వో రమేష్, రేషన్ డీలర్ రమేష్ తెలిపారు. సేవాభారతి స్ఫూర్తి సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలంలో 115 కుటుంబాలకు నిత్యావసర సరకులు, దుప్పట్లను అందించారు. పెద్దంపేట, అంబట్‌పల్లి, రాపెల్లికోట, కిష్టరావుపేట, సూరారంతో పాటు పలు గ్రామాల్లో ఒక్కో కుటుంబానికి రూ.1500 విలువైన సామగ్రిని పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు కేదారి ప్రవీణ్, గడ్డం శ్రీనివాస్, కృషిధర్, వెంకన్న, దేవరావు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ

మండలంలోని వాజేడు, పేరూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యపర్యవేక్షకులు, వైద్యసహాయకులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు సేవాభారతి స్వచ్ఛంద సంస్థ మెడికల్ కిట్లు అందించింది. 80 మందికి కిట్లను పంపిణీ చేసినట్లు సంస్థ సభ్యుడు సతీశ్ తెలిపారు.

# ఆస్తిపన్ను వివాదం కొలిక్కి వచ్చేనా?

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పురపాలక- సిర్పూర్ కాగితం మిల్లు (ఎస్పీఎం) యాజమాన్యం మధ్య ఆది నుంచి ఆస్తిపన్ను వివాదం కొనసాగుతోంది. బల్దియా అధికారులు ఆస్తిపన్ను చెల్లించాలంటూ నోటీసులు జారీ చేయడం.. యాజమాన్యం కోర్టును ఆశ్రయించడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి సర్వే చేపట్టి దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.పురపాలక పరిధిలో 30 వార్డులుండగా, ఇందులో 12 వార్డుల పరిధిలో ఎస్పీఎం మిల్లు, క్వార్టర్లు, కాలనీలున్నాయి. పురపాలక ఆధ్వర్యంలో ఆ కాలనీల్లో అభివృద్ధి, పారిశుధ్యం, విద్యుత్తు వీధి దీపాలు, తాగునీటి సదుపాయం కల్పిస్తోంది. కానీ పురపాలకకు కొన్నేళ్లుగా యాజమాన్యం ఆస్తిపన్ను మాత్రం చెల్లించడం లేదు. యాజమాన్యం ప్రతి ఏడాది బల్దియాకు రూ.10లక్షల చొప్పున ఆస్తిపన్ను చెల్లించేది. 2004-05 ప్రభుత్వ ఆదేశాల మేరకు బల్దియా ఆస్తిపన్ను పెంచింది. ఏడాదికి రూ.50 లక్షల చొప్పున చెల్లించాలని పుర అధికారులు ఎస్పీఎంకు నోటీసులు జారీ చేసింది. అంత పెద్ద మొత్తంలో



చెల్లించలేమంటూ అప్పటి యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. అప్పటి నుంచి పన్ను వివాదం కోర్టు పరిధిలోకి వెళ్లింది. 2014 సంవత్సరం వరకు పురపాలకకు ఎస్పీఎం యాజమాన్యం రూ.5.50 కోట్ల ఆస్తి బకాయిలు పేరుకుపోగా, ఆర్థిక సంక్షోభం.. నష్టాల పేరిట మిల్లు అదే సంవత్సరం సెప్టెంబరు 27న మూతపడిన విషయం తెలిసిందే.

రూ.87 లక్షలు చెల్లించాలంటూ నోటీసు

మూతపడిన మిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు కల్పించడంతో జేకే యాజమాన్యం 2018 ఆగస్టు 2న పునఃప్రారంభించింది. అప్పటి నుంచి బకాయిలు చెల్లించాలంటూ పురపాలక అధికారులు ప్రస్తుత జేకే యాజమాన్యానికి నోటీసులు జారీ చేయగా, పాత బకాయిలు కాకుండా పునరుద్ధరణ జరిగినప్పటి నుంచి చెల్లించేందుకు ముందుకు వచ్చింది. బల్దియా అధికారులు పాత బకాయిలు కాకుండా ఏడాదికి రూ.87 లక్షల చొప్పున చెల్లించాలంటూ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. క్వార్టర్లన్నీ శిథిలమయ్యాయి. గతంలో ఎనిమిది కాగితం ఉత్పత్తి యంత్రాలుండగా, ప్రస్తుతం నాలుగు మాత్రమే నడుస్తున్నాయి. ఆస్తిపన్ను తగ్గించాలంటూ యాజమాన్యం కోరింది. రూ.40 లక్షల వరకు మాత్రమే చెల్లించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది.

కాలనీలు, క్వార్టర్ల వివరాలు సేకరణ

రెవెన్యూ, జిల్లా పరిశ్రమల విభాగం అధికారులు, పురపాలక, ఎస్పీఎం యాజమాన్య ప్రతినిధుల మధ్య ఉమ్మడి సర్వే నిర్వహించి, ఆస్తి పన్ను నిర్ణయం తీసుకోవాల్సిందిగా జిల్లా పాలనాధికారి ఆదేశించారు. బుధవారం బృందం సభ్యులు ఎస్పీఎం కాలనీలు, మిల్లు, క్వార్టర్లలో పర్యటించి, సర్వేలు జరిపి నిర్ణయం తీసుకోనున్నారు.

నివేదిక ఆధారంగా పన్నులు.. : - అంజయ్య, పుర కమిషనర్

సిర్పూర్ కాగితం మిల్లు ఆస్తి పన్ను విషయంలో ఉమ్మడి సర్వే చేపట్టనున్నాం. ఆ సర్వే నివేదిక ఆధారంగా పన్ను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

# ఇన్‌స్పైర్ ప్రదర్శన అంశాలకు పదును

జనగామ : రానున్న రెండు నెలల్లో జరిగే ఇన్‌స్పైర్ జాతీయ పోటీలకుగాను ప్రదర్శనాంశాలకు మెరుగులు దిద్దేందుకు 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ)' విభాగం అవసరమైన సొమ్ము అందిస్తామని చెప్పడంతో విద్యార్థులు, గైడ్ టీచర్లు కసరత్తు మొదలుపెట్టారు. రాష్ట్రం నుంచి 37 ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికకాగా, అందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తొమ్మిది ఉన్నాయి. వారు ప్రదర్శనలకు మెరుగులు దిద్దుకుంటున్న తీరుపై కథనం. మే నెలలో కార్యశాల..కరోనా మూలంగా రెండేళ్లుగా ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించకపోవడంతో, ఈ ఏడాది ప్రత్యక్షంగా నిర్వహించాలని తలపెట్టింది. రాష్ట్ర స్థాయికి వివిధ జిల్లాల నుంచి ఎంపికైన ప్రదర్శనలు సమర్పించిన విద్యార్థులు, గైడ్ టీచర్లతో గత మే నెలలో కందిలోని ఐఐటీ అధ్యాపకులతో రెండు రోజుల కార్యశాల నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు తమ గైడ్ టీచర్ల పర్యవేక్షించిన అంశాలను



అందులో ప్రదర్శించారు. నిపుణులు వీటిని పరిశీలించి జాతీయ స్థాయిలో నిలదొక్కుకోవాలంటే మరిన్ని సొబగులు, మార్పులు అవసరమని ప్రతి విద్యార్థికి వివరించి చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం

మొదట ప్రదర్శనకు ఎంపికైన అంశానికి రూ.10 వేలు ఇచ్చిన డీఎస్టీ, జాతీయ స్థాయిలో మెరవాలంటే అమలుకు దగ్గరగా ప్రదర్శనాంశం ఉండాలని సూచించి, అవసరమైన డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చిందని జనగామ జిల్లా సైన్సు అధికారి గౌసియాబేగం చెప్పారు. విద్యార్థులు గైడ్ టీచర్ల సహాయంతో ప్రదర్శనాంశాల తయారీకి అవసరమైన మార్పులు చేసే క్రమంలో ఎంత సొమ్ము అవసరమో తెలుపుతూ ప్రతిపాదనలు సమర్పించారు. దేవరుప్పుల మండలం ధర్మాపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని నిహారిక రైలు బోగీలలో ఇతర అవసరాలకు వాడేందుకు వర్షపు నీటిని ఎలా ఒడిసి పట్టుకోవాలో వివరించే ప్రదర్శన సమర్పించింది. నిపుణుల సూచన మేరకు మరింత మెరుగులు దిద్దేందుకు కనీసం రూ.14 వేలు అవసరమని ప్రతిపాదనలు పంపామని గైడ్ టీచర్ మామిడాల వేంకటేశ్ తెలిపారు. త్వరలో ఈ మొత్తం విద్యార్థి బ్యాంకు పొదుపు ఖాతాలో జమ కానుందని గౌసియాబేగం తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలుండే విధంగా అంశాలుండాలని చెప్పడంతో విద్యార్థులు గైడ్ టీచర్లు ఆ క్రమంలో కసరత్తు చేస్తున్నారు.



# విద్యుత్ షాక్‌తోనే 40 మంది మృతి..!

భువనేశ్వర్: ఒడిశాలో గతవారం మూడు రైళ్లు ఢీకొన్న ఘోర ప్రమాదంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 278 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అయితే ఇందులో కనీసం 40 మంది విద్యుత్ షాక్ వల్లే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన ఓ పోలీసు అధికారి వెల్లడించారు. ప్రమాదం తర్వాత ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బంది.. పట్టాలు తప్పిన బోగీల నుంచి మృతదేహాలను బయటకు తీశారు. అయితే ఇందులో కనీసం 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలైన ఆనవాళ్లు కన్పించలేదని సదరు పోలీసు అధికారి తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కూడా తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో లైవ్ ఓవర్‌హెడ్ కేబుల్ తెగి బోగీలపై పడిందని, దీంతో విద్యుత్ షాక్ జరిగిందని రైల్వే పోలీసులు తెలిపారు. "కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొట్టిన తర్వాత ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. ఇందులో కొన్ని పక్కనున్న ట్రాక్‌పై పడ్డాయి. అదే సమయంలో ఆ మార్గంలో బెంగళూరు–హావ్‌డా ఎక్స్‌ప్రెస్ రావడంతో.. ఆ రైలు పట్టాలు తప్పిన కోరమాండల్ బోగీలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఓవర్‌హెడ్ లోటెన్షన్ లైన్ విద్యుత్ తీగలు తెగి బోగీలపై పడ్డాయి. దీంతో విద్యుదాఘాతం కూడా చోటుచేసుకుంది. బోగీల మధ్య నలిగిపోవడంతో చాలా మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమయ్యాయి. అయితే, దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు కన్పించలేదు. రక్తస్రావం జరిగిన ఆనవాళ్లూ లేవు. బోగీలపై లోటెన్షన్ వైర్ పడి విద్యుత్ ప్రసరించడంతో వీరు కరెంట్ షాక్‌కు గురై చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నాం" అని ఆ పోలీసు అధికారి వెల్లడించారు. ఈ ప్రమాదంపై ఒడిశా పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంతో ప్రాణాలకు హాని కలిగించడం, మరణాలకు కారణమవ్వడం వంటి అభియోగాలతో ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ దుర్ఘటన వెనుక కుట్ర కోణం ఉందన్న ఆరోపణలు రావడంతో సీబీఐ రంగంలోకి దిగింది. నేడు ఘటనాస్థలానికి వెళ్లిన సీబీఐ అధికారుల బృందం దర్యాప్తు ప్రారంభించింది.



# నీటిలోపల.. నేవీ అరుదైన ఘనత

## భారత నేవీ మరో ఘనత.. నీటిలోని లక్ష్యాన్ని ఛేదించిన స్వదేశీ టార్పిడో

భారత నౌకాదళం అమ్ములపొదిలోకి మరో కొత్త అస్త్రం చేరబోతోంది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన భారీ టార్పిడోను నేవీ మంగళవారం పరీక్షించింది. నీటిలోపల ఉన్న లక్ష్యాన్ని ఈ టార్పిడో విజయవంతంగా ఛేదించింది. ఇందుకు సంబంధించిన వీడియోను నేవీ ట్విటర్‌లో పోస్ట్ చేసింది.

"నీటి అడుగున ఉండే లక్ష్యాలను కచ్చితంగా ఛేదించగల ఆయుధాల కోసం నేవీ, డీఆర్‌డీవో సాగిస్తున్న అన్వేషణలో ఇదో కీలక మైలురాయి. స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన హెవీ వెయిట్ టార్పిడోతో నీటిలోని లక్ష్యాన్ని ధ్వంసం చేశాం. ఆత్మనిర్భరతలో భాగంగా భవిష్యత్తులో మా పోరాట సంసిద్ధతకు ఇది నిదర్శనం" అని నేవీ రాసుకొచ్చింది. అయితే ఈ టార్పిడో పేరును గానీ.. ఇతర ఫీచర్లను గానీ నౌకాదళం ఇప్పుడే బయటపెట్టలేదు. హిందూ మహా సముద్రంలో చైనా కారణంగా ముప్పు పెరుగుతున్న వేళ.. నేవీ ఈ ప్రయోగం చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా.. ఇప్పటికే భారత నౌకాదళానికి వరుణాస్త్ర అనే అధిక బరువు గల టార్పిడో ఉంది. ఇది స్వయం చోదిత, నీటి అడుగు నుంచి ప్రయోగించే క్షిపణి. 30 కిలోమీటర్ల దూరంలో ఉండే లక్ష్యాలను ఛేదించేందుకు జలాంతర్గామి నుంచి శత్రునౌకల పైకి దీన్ని ప్రయోగిస్తారు.

దీన్ని విశాఖపట్నంలోని ఎన్‌టీఎస్ఎల్ (నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ ల్యాబొరేటరీ) అభివృద్ధి చేసింది.

# వైసీపీ దురాగతాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది



అమరావతి: రాష్ట్రంలో వైసీపీ దురాగతాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం సొంత జిల్లాలోనే శాంతిభద్రతలు లేవన్నారు. మొన్న నెల్లూరులో ఆనం వెంకటరమణారెడ్డిపై, నిన్న కొండేపిలో బాలవీరాంజనేయ స్వామిపై దాడికి పాల్పడ్డారన్నారు. టంగుటూరులో సుధాకర్ అనే టీడీపీ నాయకుడు పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్నాడని ఆయన భార్యను ట్రాక్టర్‌తో తొక్కించి మరీ చంపేశారని మండిపడ్డారు. నేడు కడప జిల్లా, గోపవరంలో టీడీపీ జెడ్పీటీసీ జయరామిరెడ్డిపై కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. ఇది సైకో పాలనకు నిదర్శనమని... రాష్ట్రంలో ప్రజలు, ప్రతిపక్షాలపై దాడులు చేస్తుంటే జగన్ రెడ్డి సంతోషించడాన్ని ఏమంటారని ప్రశ్నించారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు వైసీపీ రౌడీమూకలను కట్టడి చేయడం మాని వారికి వత్తాసు పలుకుతూ చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షనేతలపై వైసీపీ గూండాల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జయరామిరెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు ఏదైనా జరగరానిది జరిగితే జగన్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. జయరామిరెడ్డిపై దాడికి పాల్పడ్డ నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.



# చనిపోయాడనుకుని ట్రక్కులో ఎక్కించేశారు!

## రైలు ప్రమాద ఘటనలో దారుణం

కోల్‌కతా: ఒడిశా రైలు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని చనిపోయినట్టు భావించి మృతదేహాలు తరలించే లారీలో ఎక్కించారు. కానీ, తను ప్రాణాలతోనే ఉన్నానని సహాయక సిబ్బందికి తెలియజేశాడు. ప్రస్తుతం ఆ బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన రోజు పశ్చిమబెంగాల్‌కు చెందిన బిశ్వజిత్ మాలిక్ కూడా షాలిమర్ స్టేషన్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. బాలేశ్వర్ ప్రాంతంలో రైలు ప్రమాదానికి గురైంది. బిశ్వజిత్ కుడి చేతికి తీవ్ర గాయం కావడంతో ఎటూ కదలలేకపోయాడు. అంతలో కొంతమంది రైలులో చిక్కుకుపోయిన వారిని బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయం బాధిస్తున్నా.. బిశ్వజిత్ తన శక్తినంతా కూడదీసుకుని రైలు నుంచి బయటపడ్డాడు. ఎటూ కదల్లేని పరిస్థితి. సహాయం కోసం పిలుద్దామన్నా నోట్లోంచి మాట రావడంలేదు. మెల్లిగా కళ్లు మూతలుపడుతున్నాయి.. చుట్టుపక్కల చూసేందుకు ప్రయత్నిస్తున్నా సాధ్యంకాలేదు. కొద్దిసేపటి తర్వాత మెలకువ వచ్చింది. తన జేబులో ఉన్న ఫోన్ మోగుతున్నట్లు అనిపించింది. లేచిచూస్తే.. తనకి రెండు వైపులా కొంతమంది అచేతనంగా పడి ఉన్నారు. అప్పుడు అర్థమైంది బిశ్వజిత్‌కు.. తను కూడా చనిపోయానని భావించి, మృతదేహాలను తరలించేందుకు ఏర్పాటు చేసిన లారీలో ఎక్కించారని. వెంటనే అక్కడున్న వారికి తాను బతికే ఉన్నానని తెలిసేలా తన ఎడమచేతిని పైకెత్తాడు. గమనించిన సహాయక సిబ్బంది.. బిశ్వజిత్‌ను చికిత్స కోసం గోపాల్‌పుర్ ఆసుపత్రికి తరలించారు. తర్వాత తన తండ్రికి ఫోన్‌లో పరిస్థితి వివరించడంతో.. ఆయన గోపాల్‌పుర్ ఆస్పత్రికి చేరుకుని బిశ్వజిత్‌ను కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎమ్ ఆసుపత్రికి తరలించారు.

ప్రస్తుతం బిశ్వజిత్ పరిస్థితి నిలకడగానే ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఒకవేళ తనకు మెలకువ రాకపోతే చనిపోయిన వారితోపాటు తనను కూడా తరలించేవారని, దేవుడి దయతో బతికి భయపడ్డానని బిశ్వజిత్ చెమ్మగిల్లిన కళ్లతో చెప్పాడు.

# హనుమాయమ్మ మృతిపై జోక్యం చేసుకోండి: చంద్రబాబు



అమరావతి: ప్రకాశం జిల్లాలో తెదేపా నేత భార్య, హనుమాయమ్మ మృతిపై డీజీపీ సహా పలువురు అధికారులను ఆ పార్టీ అధినేత చంద్రబాబు లేఖలు రాశారు. ఎస్సీ మహిళ మృతిపై జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు కూడా లేఖలు రాశారు. హనుమాయమ్మ మృతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరపాలని కోరారు. ఘటనలో వైకాపా నేతలకు పోలీసుల సహకారంపైనా విచారించాలన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఆమె కుమార్తెకు ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టంగుటూరు మండలం రావివారిపాలేనికి చెందిన తెదేపా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుధాకర్ భార్య హనుమాయమ్మను సోమవారం కొండలరావు అనే వ్యక్తి ట్రాక్టర్‌తో ఢీ కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామి అనుచరుడిగా సుధాకర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సుధాకర్ భార్య హనుమాయమ్మ అదే గ్రామంలో అంగన్‌వాడీ టీచర్. స్థానిక వైకాపా నాయకుడు సవలం కొండలరావు, సుధాకర్ కుటుంబాల మధ్య పొలం తగాదాలున్నాయి. సోమవారం వైకాపా నియోజకవర్గ బాధ్యుడు వరికూటి అశోక్‌బాబు తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే స్వామి ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టారు. దీన్నిఅడ్డుకునేందుకు తెదేపా శ్రేణులతోపాటు సుధాకర్ ఉదయాన్నే తూర్పునాయుడుపాలెం వెళ్లారు. ఇదే సమయంలో ఉదయం అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లిన హనుమాయమ్మ.. మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చారు. ఇంటి ఎదుట రహదారి పక్కన నిల్చుని కుమార్తె మాధురిని మంచినీళ్లు తేవాలని పిలిచారు. ఆమె నీళ్లు తెచ్చి తల్లికిచ్చి తిరిగి లోపలికి వెళ్లారు. ఇంటి గోడ పక్కన నిల్చుని మంచినీళ్లు తాగుతున్న హనుమాయమ్మను అప్పటికే అక్కడ ట్రాక్టర్‌తో వేచి ఉన్న సవలం కొండలరావు వేగంగా వెనక్కి వచ్చి గొర్రుతో ఢీకొట్టాడు. కింద పడిన ఆమె ఇంకా ప్రాణాలతో ఉందేమో అనే అనుమానంతో మరోసారి ట్రాక్టర్‌తో తొక్కించడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది.

# ఉద్యోగులకు మళ్లీ అన్యాయమే: పట్టాభి



మంగళగిరి: మంత్రుల కమిటీ సమావేశంలోనూ ఉద్యోగులకు తీవ్ర అన్యాయమే జరిగిందని తెదేపా అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆక్షేపించారు.

ఓవైపు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి.. మరోవైపు ఉద్యోగుల ఇళ్లకు పోలీసులను పంపి బెదిరింపులకు పాల్పడ్డారని విమర్శించారు. కొత్త పీఆర్సీకి కమిటీ పేరుతో మరోసారి కాలయాపనకు కుట్రపన్నుతున్నారని.. సీఎం జగన్ మరోసారి ఉద్యోగులను మోసం చేస్తున్నారని పట్టాభి ఆరోపించారు. ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రుల కమిటీ సోమవారం నిర్వహించిన చర్చల్లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) రద్దుపై రాష్ట్ర ప్రభుత్వ ఎలాంటి హామీ ఇవ్వలేదు. గతంలో ప్రకటించినట్లే గ్యారెంటీ పెన్షన్ పథకం(జీపీఎస్) అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. సీపీఎస్ ఉద్యోగులకు 33 శాతం గ్యారెంటీ పెన్షన్ ఉండేలా జీపీఎస్‌లో కొన్ని మార్పులు ఉంటాయని, దీనిపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం ప్రకటించనున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

# యలమంచిలిలో దళితుల భూములను వైసీపీ లాక్కోవడం అన్యాయం



అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలిలో దళితుల లంక భూములను వైసీపీ ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడం అన్యాయమని టీడీపీ నేత పీతల సుజాత మండిపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు లంక భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తూ ప్రమాద ఘంటికలుగా మారుస్తున్నారన్నారు. మట్టి తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును అరెస్టు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటు పట్టా పేరుతో ఇప్పటికే 12 వేల ఎకరాల దళితుల అసైన్డ్ భూములు లాక్కున్న జగన్ రెడ్డికి దాహార్తి తీరలేదన్నారు.

అది చాలదన్నట్లు ఇప్పుడు లంక భూములపై వైసీపీ నేతల కళ్లు పడ్డాయని విమర్శించారు. దళితులకు అండగా నిలిచిన టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టు చేసిన నిమ్మెల రామానాయుడును వెంటనే రిలీజ్ చేయాలన్నారు.

దళితుల భూముల్లో మట్టితవ్వకాలను నిలుపుదల చేయాలని పీతల సుజాత డిమాండ్ చేశారు.

# బలవంతంగా నిమ్మల రామానాయుడు అరెస్ట్.. యలమంచిలిలో ఉద్రిక్తత



పశ్చిమగోదావరి: జిల్లాలోని యలమంచిలి మండలం చించినాడ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడిని అరెస్టుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించడం ఉద్రిక్తతకు దారి తీసింది. నిమ్మలను అరెస్ట్ చేయనీకుండా దళితులు, టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. చివరకు ఎమ్మెల్యే రామానాయుడిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని.. పాలకొల్లు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే.. చించినాడలో దళితుల భూముల స్వాధీనానికి సర్కారు కొంతకాలంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా, దళితులకు మద్దతుగా నిన్నటి నుంచి రామానాయుడు ఆందోళన చేపట్టారు. ఈరోజు నిమ్మల రామానాయుడు చేస్తున్న ఆందోళనకు అడ్డుకున్న పోలీసులు ఎమ్మెల్యేను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# ఏపీ ప్రభుత్వ అధ్వర్యంలో మేదోమధన సదస్సు




విజయవాడ: ఏపీ వ్యవసాయ, వాణిజ్య పంటల ఎగుమతులపై మంగళవారం విజయవాడలో ఏపీ ప్రభుత్వ అధ్వర్యంలో మేదోమధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం రైతుకు ఎలా తీసుకురావాలనే లక్ష్యంతో ఈ వర్క్‌షాపు నిర్వహించామన్నారు. వ్యవసాయం రైతుకు లాభసాటిగా మార్చాలని సీఎం జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారని, భగవంతుడికి ప్రసాదం పెట్టాలన్నా రైతు పండించినదే పెట్టాలన్నారు. రైతులకు మరింత వెసులుబాటు కలిగించేలా కార్యక్రమాలు చేయాలని సీఎం ఆదేశించారన్నారు. మల్టీ పర్పస్ గోడౌన్‌లు వస్తున్నాయని, సొసైటీలు, మార్కెట్ యార్డులు రాజకీయ పునరావాసాలుగా మారిపోకుండా డిజిటల్ విధానం తెచ్చామని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. వంద దేశాలకుపైగా మన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసే అవకాశం ఉందని, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన యూనివర్సల్‌గా మారడానికి కారణం ఆంధ్రప్రదేశ్ అని, రైతు అసలైన శాస్త్రవేత్త అని.. రైతు మాత్రమే ప్రయోగాలు చేయడానికి అర్హుడని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాగా కాకాణి గోవర్ధన్ రెడ్డి పొలిటికల్ కామెంట్లు చేశారు. ఆనం వెంకటరమణారెడ్డిపై దాడి ఎవరు చేసారనేది పోలీసులు తేలుస్తారన్నారు. ఈలోపే సజ్జల పేరు, తన పేరు.. ఇలా ఎవరికి తోచిన పేరు వాళ్ళు చెపుతున్నారని, టీడీపీ కామెంట్లు అసలు పట్టించుకోవక్కర్లేదన్నారు. కోర్టులో చోరీ అంశంలో సీబీఐ విచారణను స్వాగతిస్తున్నానని, కోర్టులో చోరీ విషయంలో ఏం జరిగిందో త్వరలో తేలుతుందని.. అప్పుడు తాను కోర్టులో చోరీ అంశంపై కామెంట్ చేస్తానని కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు.

# సీబీఐ మాజీ డైరెక్టర్ ప్రకటనపై బీజేపీ సర్కార్ తక్షణమే స్పందిచాలి



అమరావతి: బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి దేశవ్యాప్తంగా రైతుల నుంచి శ్రామికుడు వరకు ఆకలితో అలమటిస్తున్నారని సీపీఐ నేత రామకృష్ణ విమర్శించారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో పొలిటికల్ వర్క్‌షాప్‌ను రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడా బాబులు అంబాని నుంచి అదాని వరకు దోపిడీకి తెరలేపినా చోద్యం చూస్తూ కూర్చోవడం బీజేపీ నేతల పనిగా మారిందని మండిపడ్డారు. ఒడిశా రైలు ప్రమాదంపై సీబీఐ మాజీ డైరెక్టర్ ఇచ్చిన ప్రకటనకు బీజేపీ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంపై స్పందించకుండా సమస్యను పక్కదారి పట్టించడానికి బీజేపీ దొంగ దారులు వెదుకుంటోందని వ్యాఖ్యలు చేశారు. కేంద్ర హోంమంత్రి, రాష్ట్ర హోంమంత్రి, రైల్వే శాఖ మంత్రి కుల మత విద్వేషాలు సృష్టించాలని చూడటం దారుణమన్నారు. రైల్వే దుర్ఘటనపై హోంమంత్రి ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రామకృష్ణ ఇంకా మాట్లాడుతూ.. సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టు పర్యటనకు ఎందుకు వెళుతున్నారో ఆయనకైనా తెలుసో లేదో అంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో లాలూచిపడి రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ కాళ్ళ దగ్గర పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టుపై సీఎం తక్షణమే స్పష్టమైన వైఖరిని ఏపీ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూన్ 26 న పోలవరం ప్రాజెక్టు వద్ద భారీ బహిరంగ సభను సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని రామకృష్ణ పేర్కొన్నారు.

# నడుము చూపిస్తూ హొయలు పోతూ... లెజెండ్ బ్యూటీ కవ్వింత

మోడల్ గా కెరీర్ ను ఆరంభించి ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సోనాల్ చౌహాన్. తెలుగు లో ఈ అమ్మడు రెయిన్ బో అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. కానీ ఆ సినిమా నిరాశ పరిచింది. అయితే బాలయ్య లెజెండ్ సినిమాలో నటించి మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. లెజెండ్ సినిమా తో వచ్చిన సక్సెస్ కారణంగా ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తుందని అంతా భావించారు. కానీ లెజెండ్ సినిమా యొక్క సక్సెస్ ను సోనాల్ చౌహాన్ సద్వినియోగం చేసుకోలేక పోయింది. ఆకట్టుకునే అందంతో పాటు



సోనాల్ నటన పరంగా పలు సినిమాలో మెప్పించింది కానీ ఆఫర్లు మాత్రం దక్కించుకోలేక పోతుంది. ఈ మధ్య కాలంలో ఆఫర్లు తగ్గినా కూడా వార్తల్లో మాత్రం ఉంటూనే ఉంది. కారణం సోనాల్ యొక్క అందం. ఇన్ స్టా గ్రామ్ లో ఈమె షేర్ చేసిన ఫోటోలు మరియు వీడియోలు ఎప్పటికప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉన్నాయి. ముఖ్యంగా ఈమె స్కిన్ షో ఫోటోలు కన్నుల విందు చేస్తున్నాయి. తాజాగా టాప్ ను ఇంకాస్త పైకి అన్నట్లుగా మడిచి నడుము అందాన్ని చూపిస్తూ హొయలు పోతూ కన్నుల విందు చేస్తుంది.

ఆకట్టుకునే అందం తో ఈమె సొంతం అవ్వడంతో అంతా కూడా ఈ ఫోటోలను తెగ లైక్ చేస్తున్నారు. ఈ స్థాయిలో కవ్విస్తూ ఉంటే మళ్లీ ఈమెను తెలుగు లో స్టార్ ఫిల్మ్ మేకర్స్ కోరుకునే అవకాశాలు ఉన్నాయి. పూర్తిగా టాలీవుడ్ కు దూరం అవ్వకుండా అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉంది. ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటిస్తుందేమో చూడాలి.

## రకుల్ కి ఎంత కష్టం వచ్చిందో..!

తెలుగులో యువ హీరోలతో కెరీర్ మొదలు పెట్టి స్టార్ క్రేజ్ తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ అంతే తొందరగా కెరీర్ గ్రాఫ్ పడిపోయేలా చేసుకుంది. కథల ఎంపికనో.. అమ్మడి ఫేట్ అనుకోవాలో తెలియదు కానీ రకుల్ కి టాలీవుడ్ లో పెద్ద షాకే తగిలింది. స్టార్ హీరోయిన్ గా కొద్దికాలం మాత్రమే వెలిగిన రకుల్ ఇప్పుడు తెలుగులో ఒక్క ఛాన్స్ వస్తే చాలని అనుకుంటోంది. ఈమధ్య బాలీవుడ్ లో కూడా వరుస సినిమాలతో సందడి చేస్తున్న రకుల్ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో క్రేజ్ తెచ్చుకోలేకపోతుంది. ఇక చేసేదేమి లేక రకుల్ తన అందాలకు పని చెప్పినట్టు తెలుస్తుంది. రకుల్ సోషల్ మీడియా పేజ్ వైపు ఓ లుక్కేస్తే ఈమధ్య అమ్మడు ఓ రేంజ్ లో రెచ్చిపోతూ ఫోటో షూట్స్ చేస్తుంది. ముఖ్యంగా రకుల్ ఈ కష్టం అంతా అవకాశాల కోసమే అన్నట్టు తెలుస్తుంది. రోజుకొక ఫోటో షూట్ తో తన గ్లామర్ ట్రీట్ అందిస్తున్న రకుల్ ఎలాగైనా సరే మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది. అయితే ఈ ఫోటో షూట్స్ అమ్మడికి ఛాన్స్ లు వచ్చేలా చేస్తాయా అంటే ఏమో చెప్పలేం తెచ్చినా



తేవొచ్చని అంటున్నారు కొందరు. కెరియర్ తొలినాళ్లలోనే సినిమాల పట్ల దూకుడుగా కనిపించిన రకుల్ స్టార్స్ సరసన కూడా సూపర్ అనిపించుకుంది. అయితే అదే ఫాం కొన్నాళ్లు కొనసాగిస్తుందని అనుకుంటే అమ్మడు కెరీర్ సడెన్ గా అయోమయంలో పడింది. తన కథల సెలక్షన్ కావొచ్చు.. సినిమాలు కావొచ్చు రకుల్ ఇమేజ్ ని డ్యామేజ్ చేశాయి. అయినా సరే పట్టు వదలకుండా అమ్మడు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈమధ్య సోషల్ మీడియాలో ప్రతి హీరోయిన్ రెచ్చిపోతూ ఫోటో షూట్స్ చేయడం కామన్ అయ్యింది. వారి దారిలోనే రకుల్ మరింత గ్లామర్ డోస్ అందిస్తూ సత్తా చాటుతుంది. మరి ఈ ఫోటో షూట్స్ ఆమెకు ఛాన్స్ రూపంలో మారుతాయా లేదా అన్నది చూడాలి. అవకాశాల సంగతి అటుంచితే రకుల్ చేస్తున్న ఈ హాట్ ఫోటో షూట్స్ నెటిజన్లకు మంచి ట్రీట్ అందిస్తున్నాయి. తెలుగులో అవకాశాల కోసం బాగా ట్రై చేస్తున్న రకుల్ ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటూ ఇక్కడ వారికి హింట్ ఇస్తుంది. విహారయాత్రల్లో కథానాయికల అందాల ప్రదర్శన ఎప్పుడూ హాట్ టాపిక్ గా మారుతుంది. వారిలో రకుల్ చేస్తున్న ఈ హాట్ షో కూడా ఆమెకు మంచి మైలేజ్ ఇస్తుంది.




# స్నేహితుడిని పెళ్లాడాలనుకున్న తమన్నాకు చిక్కులు!



మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా ఓ వైపు అగ్ర హీరోల సరసన వెండితెర పై నటిస్తూనే ఓటీటీలో నాయికా ప్రధాన పాత్రలను ఎంపిక చేసుకుంటోంది. ఇదే కేటగిరీ కి చెందిన వెబ్ సిరీస్ జీ కర్దా. ఈ సిరీస్ ట్రైలర్ తాజా గా విడుదలైంది. ఇందులో తమన్నా భాటియా షో ఆద్యంతం రక్తి కట్టిస్తోంది. రొమాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమా కథాంశం ఆద్యంతం తమన్నా చుట్టూనే తిరుగుతోంది. అమెజాన్ ఒరిజినల్ సిరీస్ 'జీ కర్దా' ట్రైలర్ ను జూన్ 5న ఆవిష్కరించారు. తమన్నా భాటియా– సుహైల్ నయ్యర్– అన్యా సింగ్– ఆషిమ్ గులాటీ– హుస్సేన్ దలాల్– సయాన్ బెనర్జీ– సంవేద సువాల్కా నటించిన ఈ వెబ్ సిరీస్ ఏడుగురు చిన్ననాటి స్నేహితుల చుట్టూ తిరిగే కథాంశం. మనిషి జీవితం లో భావోద్వేగాల సమ్మిళితాన్ని దాని లోతు ను ప్రదర్శించే సిరీస్ ఇది. యూత్ జీవితాల్లో ఎలాంటి అసాధారణ మలుపులు ఉంటాయి? అన్నది తెర పై చూపిస్తున్నారు. రిషబ్ (సుహైల్ నయ్యర్) తన చిరకాల స్నేహితురాలు లావణ్య (తమన్నా భాటియా)కి ప్రపోజ్ చేస్తాడు. దానికి లావణ్య ఓకే చెబుతుంది. కానీ పెళ్లికి ముందు స్నేహితులందరి మధ్య గొడవలు జరుగుతాయి. రిషబ్ – లావణ్య పెళ్లి చేసుకోవడం మంచిది కాదని తెలుసుకున్న తర్వాత కథ ఒక విచిత్ర మైన చమత్కారమైన మలుపు తిరిగింది. అదేమిటన్నది సిరీస్ లో చూసి తెలుసుకోవాలి. తమన్నా భాటియా మాట్లాడుతూ–జీ కర్దాలో పని చేయడంలో నాకు ఆనందం కలిగించింది. నా స్వంత వ్యక్తిత్వం ప్రతిబింబించే అత్యంత సన్నిహిత మైన పాత్ర ఇది. నిజాని కి ముంబై అమ్మాయిగా ఈ చైతన్యవంత మైన నగరం లో పెరిగా ను. నేను స్కూల్ లో ఏర్పరచుకున్న స్నేహాలు ఇతర స్నేహాల కు భిన్నమైనవి. అలాంటి బంధాలు భర్తీ చేయలేనివ ని నేను నమ్ముతున్నాను. ఈ షో నిజంగా నాస్టాల్జియా సారాన్ని తెర పై చూపిస్తుంది. నా జీవితాను భవాల ను ప్రతిబింబించే ఈ సిరీస్ నా నగరం లో తెరకెక్కిన కథతో కావడం ఆసక్తికరం" అని తెలిపింది. జీ కర్దా ట్రైలర్ డ్రామా– రొమాన్స్– ఎమోషన్స్ తో ఆద్యంతం హుషారు గా కనిపిస్తోంది. విడుదలైన కొన్ని గంటల్లో నే ఈ ప్రోమో సోషల్ మీడియా వైరల్ గా దూసుకెళుతోంది. దినేష్ విజన్ మాడాక్ ఫిల్మ్స్ నిర్మించగా.. అరుణిమ శర్మ దర్శకత్వం వహించారు. దీనిని హుస్సేన్ దలాల్ – అబ్బాస్ దలాల్ కలిసి రచించారు. ఈ డ్రామా సిరీస్ జూన్ 15 నుండి ప్రైమ్ వీడియోలో ప్రసారం కానుంది. జీ కర్దాతో పాటు రజనీకాంత్ జైలర్ లో తమన్నా భాటియా కనిపించనుంది. ఆమె చిరంజీవి సరసన భోలా శంకర్ లోను నటిస్తోంది. దిలీప్ తో తమన్నా ప్రాజెక్ట్ బాంద్రా కూడా పైప్ లైన్ లో ఉంది.

# 'స్కామ్ 1992' దర్శకుడి నుంచి క్రైమ్ రిపోర్టర్ మర్డర్ మిస్టరీ!




ఫ్యామిలీమ్యాన్ వెబ్ సిరీస్ సంచలన విజయం సాధించడంతో రాజ్ అండ్ డీకే పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. అదే క్రమంలో హన్సల్ మెహతా 2020లో స్కామ్ 1992 సిరీస్ ని విడుదల చేసారు. భారతదేశంలోని మొదటి తరం క్లాసిక్ వెబ్ సిరీస్ లలో ఇది ఒకటి. విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల ఆదరణను పొందిన క్రేజీ వెబ్ సిరీస్ గా పాపులరైంది. ఇప్పుడు హన్సల్ మెహతా నుంచి స్కూప్ అనే మరో గ్రిప్పింగ వెబ్ సిరీస్ రానుంది. ఒక ప్రముఖ క్రైమ్ రిపోర్టర్ హత్యకు కారణమైందనే ఆరోపణలు ఎదుర్కొనే మరొక క్రైమ్ రిపోర్టర్ ఆరోపణ గురించిన కథ ఇది. జిగ్నా వోరా రాసిన బిహైండ్ బార్స్ ఇన్ బైకుల్లా: మై డేస్ ఇన్ ప్రిజన్ అనే పుస్తకం ఆధారంగా స్కూప్ సిరీస్ రూపొందింది. మధ్యతరగతి లేఖరుల జీవిత కథల్లో మసాలా అంతగా ఉండదని అనుకుంటే పొరపాటేనని స్కూప్ ట్రైలర్ చూడగానే అర్థమైంది. ఈ వెబ్ సిరీస్ ఎంతో గ్రిప్పింగ్ గా తెరకెక్కిందని సమాచారం. అందుకే ఇప్పుడు ఈ సిరీస్ పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వెబ్ సిరీస్ లో అద్భుతమైన తారాగణం ఉంది. ఉత్సుకతను పెంచే గ్రిప్పింగ్ క్రైమ్ స్టోరికి సరిపడా పాత్రధారులను ఎంపిక చేసారు హన్సల్. జూబ్లీ తర్వాత OTT వేదికగా ప్రోసెన్ జిత్ ఛటర్జీ ఈ సిరీస్ లో అద్భుత పాత్రతో మైమరిపించనున్నారు. అలాగే కరిష్మా తన్నా తదితరులు ఈ సిరీస్ లో నటించారు. హర్మాన్ బవేజాకు రీఎంట్రీ లాంటి సిరీస్ ఇది. యూట్యూబ్ సంచలనం డానిష్ సాల్ట్ అతిథి పాత్రలో నటించారు. స్కూప్ తో హన్సల్ మరోసారి మ్యాజిక్ చేస్తాడని అంతా భావిస్తున్నారు. నిజ ఘటనలతో సహజసిద్ధమైన పాత్రలతో వెబ్ సిరీస్ లు ప్రజల్లోకి దూసుకెళుతున్నాయి. ఇది కూడా ఆ కేటగిరీకే చెందుతుంది.

# ఎర్రటి బికినీలో రకుల్ ఘాటైన అందాలు

టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తిరుగులేని ఇమేజ్ సొంతం చేసుకొని ఇక్కడి నుంచి బాలీవుడ్ చెక్కేసిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. ఇక బాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తూ కమర్షియల్ హీరోయిన్ గా అక్కడ అమ్మడు సెటిల్ అయిపోయింది. గత ఏడాది ఏకంగా ఐదు సినిమాలు రకుల్ ప్రీత్ సింగ్ ప్రేక్షకుల ముందుకి వచ్చాయి. బాలీవుడ్ లో యాక్టర్ నిర్మాత జాకీ బాగ్నానీతో ఈ అమ్మడు లివింగ్ రిలేషన్ లో ఉంది. ఇది కూడా హిందీ ఇండస్ట్రీలో హీరోయిన్ గా అవకాశాలు పెరగడానికి కారణం అని చెప్పొచ్చు. జాకీ బాగ్నానీ నిర్మిస్తోన్న సినిమాలన్నింటిలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్ గా ఉంటుంది. చివరిగా రకుల్ ప్రీత్ సింగ్ నుంచి ఈ ఏడాది హిందీలో చైత్రవలి అనే మూవీ ప్రేక్షకుల ముందుకి వచ్చింది. తాజాగా భూ అనే మూవీతో తెలుగు ప్రేక్షకులని కూడా ఒటీటీ ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ పలకరించింది. తమిళంలో శివ కార్తికేయన్ కి



జోడీగా ఆయలాన్ అనే మూవీలో నటిస్తోంది. ఈ సినిమా తెలుగు తమిళ్ భాషలలో ప్రేక్షకుల ముందుకి రానుంది. అలాగే శంకర్ కమల్ హాసన్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న ఇండియన్ 2 చిత్రంలో నటిస్తోంది. ఈ మూవీ పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ కానుంది. ఇక రకుల్ ప్రీత్ సింగ్ తన ప్రియుడు జాకీ బాగ్నానీతో త్వరలో పెళ్లి పీటలు ఎక్కుతుందనే టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో ఇన్ స్టాగ్రామ్ లో రకుల్ ప్రీత్ సింగ్ గ్లామర్ షో పెరిగిపోయింది. రెగ్యులర్ గా హాట్ హాట్ ఫోటోషూట్ లతో మెస్మరైజ్ చేస్తోంది. ఈ బ్యూటీ ఫోటోలని షేర్ చేస్తే లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు తన హాట్ ఫోటోలతో సందడి చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు తన ప్రియుడుతో కలిసి మాల్దీవుల్లో వెకేషన్ కి వెళ్ళింది. అక్కడ ఫుల్ గా సముద్రతీరంలో ఎంజాయ్ చేస్తోంది. మాల్దీవులలో రెడ్ కలర్ బికినీలో హాట్ ఫోటోలని తాజాగా రకుల్ ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. ఈ రెడ్ బికినీ షూట్ లో రకుల్ అందాలు కుర్రాళ్ళకి చెమటలు పట్టించే విధంగా ఉన్నాయని చెప్పాలి.

## వైట్ బికినీలో అనసూయ సర్ప్రైజ్

తెలుగు బుల్లితెరపై ఇప్పుడు స్టార్ యాంకర్లలో అనసూయ భరద్వాజ్ ఒకరు. ఒకప్పుడు ఏకధాటిగా షోల మీద షోలు చేసుకుంటూ వచ్చిన ఈ అమ్మడు.. కొంత కాలంగా టెలివిజన్ రంగంలో పెద్దగా సందడి చేయడం లేదు. కానీ వెండితెరపై మాత్రం వరుస చిత్రాలతో హడావిడి చేస్తోంది. ఇలా ఇప్పటికే ఎన్నో చిత్రాలతో వచ్చిన ఈ భామ.. ఇప్పుడు మరికొన్ని సినిమాలు చేస్తోంది. దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ కెరీర్ పరంగా దూసుకుపోతోన్న అనసూయ భరద్వాజ్.. వీలు చిక్కినప్పుడల్లా కుటుంబ సభ్యులతో కలిసి ఎంజాయ్ చేస్తూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఫ్యామిలీకి ఎక్కువ సమయాన్ని కేటాయిస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా తన భర్త భరద్వాజ్తో కలిసి అనసూయ వెకేషన్కు బ్యాంకాక్ వెళ్లింది. అక్కడ ఫుల్గా చిల్ అవుతోంది. బ్యాంకాక్ టూర్లో తీసుకున్న ఫొటోలు వీడియోలను అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తోంది. ఇలా ఇప్పటికే ఈ అమ్మడు చాలా వాటిని వదిలింది. ఈ



క్రమంలోనే ఇప్పుడు అనసూయ ఓ బికినీ స్పెషల్ వీడియోను పంచుకుంది. ఇందులో ఈ భామ వైట్ కలర్ టూ పీస్ బికినీలో అందాలను ఆరబోస్తూ కనిపించింది. అంతేకాదు భర్తకు ముద్దులు పెడుతూ ఓ రేంజ్లో స్టిల్స్ ఇచ్చింది. అనసూయ భరద్వాజ్ ఈ వీడియోను షేర్ చేయడానికి కారణం ఈరోజు (జూన్ 4వ తేదీ) ఆమె పెళ్లిరోజు కావడమే. అందుకే భర్తతో బీచ్లో చిల్ అవుతోన్న క్లిప్పు ఈ స్టార్ యాంకర్ షేర్ చేసింది. దీంతో అనసూయ భరద్వాజ్ షేర్ చేసిన ఈ వీడియోకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది. చాలా మంది ఈ జంటకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లను పెడుతున్నారు. తాజాగా అనసూయ షేర్ చేసిన వీడియోకు ఓ నోట్ను కూడా జత చేసింది. అందులో 'జనవరి 23 2001 తేదీన ఢిల్లీలో ఓ కార్యక్రమానికి హాజరైన సమయంలో వీరు నాకు మొదటి లవ్ లెటర్ రాశారు. దానికి అప్పుడు సమాధానం చెప్పలేదు. ఇప్పుడు బదులు ఇవ్వాలనుకుంటున్నాను' అంటూ ఓ ఎమోషనల్ నోట్ రాసింది. చివర్లో భర్తకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసింది.



# యాద్రాద్రి జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన..

## హ్యాండ్లూమ్ మోడ్రన్ సేల్స్ షోరూమ్‌కి భూమిపూజ

యాదాద్రి భువనగిరి జిల్లాలో మంత్రి కేటీఆర్ మంగళవారం పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెంలోని హ్యాండ్లూమ్ మోడ్రన్ సేల్స్ షోరూం నిర్మాణానికి మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో ఒకేసారి 51 పరిశ్రమలకు శ్రీకారం చుట్టారు. పరిశ్రమలతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, కామన్ ఫెసిలిటీ సెంటర్, సెవజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ కార్యాలయం, తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ (టిఫ్)ను ప్రారంభించారు.

టాయ్స్ పార్కుకు భూమి పూజ కూడా చేశారు. రూ. 156 కోట్లతో 106 ఎకరాల స్థలంలో ఈ పార్కును నెలకొల్పుతున్నది.

**41 కోట్లతో కామన్ ఫెసిలిటీ సెంటర్.. :** గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కామన్ ఫెసిలిటీ సెంటర్ అందుబాటులోకి రానున్నది. 5 ఎకరాల స్థలంలో సుమారు రూ.41 కోట్లతో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ కేంద్రాన్ని జనవరి 2021లో శంకుస్థాపన చేశారు.

రెండు బ్లాక్‌లుగా నిర్మించిన ఈ సెంటర్ మొదటి బ్లాక్‌లో సమావేశ మందిరాలు, నైపుణ్య శిక్షణ కేంద్రం, ఆడిటోరియం, ఐలా, టిఫ్ కార్యాలయాలు, రెస్టారెంట్లు, బ్యాంక్‌ల కోసం నిర్మించారు. పార్కులో ఉత్పత్తి చేసిన పరిశ్రమల వస్తువులను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా రెండో బ్లాక్‌ను నిర్మించనున్నారు.

# నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్



ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. అంతకుముందు పార్టీ కార్యాలయం ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ జెండాను కేసీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణ తల్లికి పూలమాల వేసి దండం పెట్టారు.

పార్టీ ఆఫీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి, జైపాల్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రూ.52 కోట్లతో నిర్మించిన జిల్లా కలెక్టరేట్, రూ.35 కోట్లతో చేపట్టిన పోలీసు భవన సముదాయాలను కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం వెలమ ఫంక్షన్ హాల్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో

నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.

# పొంగులేటి, జూపల్లి చేరికకు కాంగ్రెస్ గ్రీన్ సిగ్నల్




ఢిల్లీ: బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులు కాంగ్రెస్‌లో చేరికకు ఆపార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలతో హైకమాండ్ చర్చలు జరిపింది. కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఇప్పటికే అభిమానులకు ఆ ఇద్దరు నేతలు సంకేతాలిచ్చారు. కాగా ఈనెల 12న తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రియాంక, రాహుల్ గాంధీలతో సమావేశం కానున్నారు. ఈనెల 20వ తేదీ లేదా 25న ఖమ్మంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయితే రాహుల్ అమెరికా పర్యటన తర్వాత ఖమ్మం సభపై నిర్ణయం తీసుకోనున్నారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.


# అది నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి నేను రెడీ



హైదరాబాద్: దళితబందులో కమిషన్ తీసుకోవడం లేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకోవటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు మాజీ పీసీసీ చీఫ్ వి.హనుమంతరావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఒక వైపు దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని... మరో వైపు రైతుల పట్ల కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర వెళ్లి కిసాన్ సర్కార్ అని ప్రగల్భాలు పలకటం కాదని... రాష్ట్రంలో బాధ పడుతున్న రైతుల కన్నీళ్లు తుడవాలన్నారు. రూ. 2 లక్షలు తీసుకుని డబల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదా? అని.. రూ.3 లక్షలు కమిషన్ తీసుకుని దళితబందు ఇవ్వలేదా? అంటూ ప్రశ్నలు కురిపించారు. నూతన సచివాలయం వద్దకు సాధారణ ప్రజలు కాదు కదా, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా ఆంక్షలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో అధికారంలోకి వస్తాయని అనుకుంటున్నాయని.. కానీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేటలో పెద్ద ఎత్తున బీసీ గర్జన సభ పెట్టాలని ఆలోచిస్తున్నట్లు వీహెచ్ పేర్కొన్నారు.

# 9వ తేదీన కులవృత్తులు, చేతివృత్తులకు రూ. లక్ష ఆర్థిక సాయం.. దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ : తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. విశ్వబ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, రజక, కుమ్మరి, మేదరి వంటి కులవృత్తులు, చేతివృత్తులనే నమ్ముకొని జీవిస్తున్న వారికి రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందించాలని గత నెలలో జరిగిన కేబినెట్‌లో నిర్ణయించింది. ఇందుకు విధివిధానాలను వేగంగా రూపొందించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాల కులవృత్తులు, చేతివృత్తులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించే ప్రక్రియ మొదలైంది. ఇందుకోసం రూపొందించిన వెబ్‌సైట్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. https://tsobmmsbc.cgg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫోటో, ఆధార్, కుల ధృవీకరణ పత్రం సహా 38 కాలమ్‌లతో సరళమైన అప్లికేషన్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా తక్షణమే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కులవృత్తి, చేతివృత్తులకు సంబంధించిన పనిముట్లు,



ముడిసరకు కొనుగోలుకు ఈ ఆర్థిక సాయం అందించనున్నారు.

ఈ కార్యక్రమాన్ని జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాల జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజు అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలచే లబ్దిదారులకు రూ. లక్ష పంపిణీ చేయనున్నారు.




హైదరాబాద్: ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో స్మార్ట్ కాపీయింగ్ జరిగింది. దీనికి సంబంధించి ఓ విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ సెంటర్‌లో చింతపల్లి చైతన్య కృష్ణ అనే విద్యార్థి తాను రాసిన జవాబులను వాట్సాప్ ద్వారా మిత్రులకు పంపించాడు. మొత్తం నలుగురు విద్యార్థులకు జవాబులు పంపించినట్లు పోలీసులు గుర్తించారు. వారంతా కూడా వివిధ సెంటర్లలో పరీక్ష రాస్తున్నవారే కావడం గమనార్హం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని 23 ఐఐటీల్లో వచ్చే విద్యా సంవత్సరం (2023-24) బీటెక్ సీట్ల భర్తీకి ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ విధానంలో జరిపిన ఈ పరీక్షకు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 35 వేల మంది హాజరైవుంటారని అంచనా. ఈసారి కటాఫ్ మార్కులు సుమారు 60గా ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# సీఎం కేసీఆర్ కృషితో పరిశ్రమలకు 24 గంటలు కరెంట్ : మంత్రి ఎర్రబెల్లి



హనుమకొండ : ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల పరిశ్రమలకు 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ అందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది వేడుకలలో భాగంగా హనుమకొండ జిల్లా మడికొండ పారిశ్రామిక కేంద్రం ఆవరణలో మంగళవారం తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల పరిశ్రమలు మూతపడ్డాయని, చిన్నషాపులు జనరేటర్ పెట్టుకుని వ్యాపారం చేసుకునేవారిని అన్నారు. రాష్ట్రం ఏర్పాటుతో సీఎం కేసీఆర్, ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ కృషితో పరిశ్రమలు వస్తున్నాయని వెల్లడించారు. భారీగా పెట్టుబడులతో పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తెలంగాణ యువతకు లభిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో మెగా టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు అద్భుతమైన ప్రాజెక్ట్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, కుడా చైర్మన్ సుందర్ రాజు, హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, కలెక్టర్ సిక్త పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు అమిత్ షా, జేపీ నడ్డా.. ఈ నెలలో భారీ బహిరంగ సభలకు ప్లాన్



హైదరాబాద్ : తెలంగాణకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రానున్నారు. తెలంగాణ బీజేపీ ఈ నెలలో భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేసింది. ఈ సభలకు అమిత్ షా, నడ్డా హాజరుకానున్నారు. ఈ నెల 15న ఖమ్మానికి అమిత్ షా రానున్నారు. సాయంత్రం బహిరంగ నిర్వహించున్నారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో భాగంగా ప్రజల్లోకి బీజేపీ వెళ్లనుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా బీజేపీ బహిరంగ సభలు నిర్వహిస్తోంది. 25న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. నాగర్ కర్నూల్లో ఏర్పాటు చేసిన సభకు హాజరు కానున్నారు. ప్రధాని మోదీతోనూ బీజేపీ బహిరంగ సభ ప్లాన్ చేస్తోంది.

# 26 దేవాలయాలకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తాం : మంత్రి తలసాని



హైదరాబాద్ : ఆషాఢ బోనాల ఉత్సవాలకు వారం ముందే ఆలయాలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందజేస్తామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో సుమారు 26 దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డిలు కూడా పట్టువస్త్రాలను సమర్పిస్తారని, ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులతో బోనాల ఉత్సవాలపై మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22 వ తేదీ నుండి ఆషాఢ బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 22 న గోల్కొండ బోనాలు, జులై 9 న సికింద్రాబాద్ బోనాలు, 16 వ తేదీన ఓల్డ్ సిటీ బోనాలు జరుగుతాయని వివరించారు. బోనాల ఉత్సవాలకు లక్షలాదిమంది వస్తారని, దానిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆధ్వర్యంలోని వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ పరిధిలో లేని దేవాలయాలకు కూడా ఆర్థిక సహాయం అందిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గత సంవత్సరం జీహెచ్ఎంసీ పరిధిలో 3039 దేవాలయాలకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా వివిధ ఆలయాలకు ఆర్థిక సహాయం అందించడం కోసం ప్రభ్యుత్వం రూ. 15 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. ఈ సంవత్సరం బోనాల ఉత్సవాలకు వారం ముందే దేవాలయాలకు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఆలయ కమిటీల నిర్వహకులు కూడా వీలైనంత త్వరగా దరఖాస్తులను అధికారులకు అందజేయాలని మంత్రి కోరారు. మన సంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా గోల్కొండ కోట, ఓల్డ్ సిటీలోని దమయంతి భవన్, సికింద్రాబాద్‌లో త్రీ డీ మ్యాపింగ్‌కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రధాన దేవాలయాల వద్ద సాంస్కృతిక శాఖ కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రధాన ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోనాల ఉత్సవాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, డీఆర్‌వో సూర్యలత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు ఐదు రోజులు వర్ష సూచన.. జిల్లాల్లో వడగాల్పులు..!

తెలంగాణ రాగల ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో పలు జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే సూచనలున్నాయని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. అలాగే బుధవారం ఆసిఫాబాద్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాలు వీస్తాయని పేర్కొంది. గురువారం



ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో, శుక్రవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో.. శనివారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేటలో వడగాలులు వీచే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com